


# విజయభాను

విశాఖపట్నం, గురువారం 27-04-2023 | VIJAYABHANU DAILY * VISAKHAPATNAM | సంపుటి : 47 సంచిక : 189 పేజీలు : 08 వెల : 1 రూపాయి

### రాష్ట్రంలో నాణ్యమైన చదువుల కోసం

## విప్లవాత్మక మార్పులు

### వసతి దీవెన నగదును విడుదల చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి





అనంతపురం, (విజయభాను న్యూస్) : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీసత్యసాయి జిల్లా శింగనమల నియోజకవర్గం నార్పలలో పర్యటించారు. జగనన్న వసతి దీవెన లబ్ధిని బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాలకు దాదాపు 9 లక్షల మందికి పైగా విద్యార్థులకు రూ.912.71 కోట్ల ఆర్థిక సాయాన్ని జమ చేశారు. ఐటీఐ విద్యార్థులకు రూ. 10 వేలు.. పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ. 15 వేలు.. డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ చదువుతున్న విద్యార్థులకు రూ. 20 వేలు అందిస్తున్నారు. ఇది జగనన్న విద్యాదీవెనకు తోడుగా అందిస్తున్న జగనన్న వసతి దీవెన అని గుర్తు చఏశారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ పూర్తిగా విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. నార్పల సభలో ప్రతిపక్ష నేత చంద్రబాబుపై వైఎస్ జగన్ సెటైర్లు పేల్చారు. ఈ మధ్య జాతీయ మీడియాకు ఒక ముసలాయన వచ్చీ రాని భాషలో ఇంటర్వ్యూ ఇచ్చారని.. ఆయన మాటలు వినేప్పుడు తనకు పులి కథ గుర్తుకు వచ్చిందన్నారు. 'నరమాంసం తినే పులి ముసలిదైపోయిందట.. వేటాడే శక్తి, పరిగెత్తే ఓపిక లేకపోవడంతో ఓ నాలుగు నక్కలను తోడేసుకుందట. మనుషుల్ని తినేందుకు ప్లాన్ వేసి.. ఒక ముడగు పక్క కూర్చుని.. వచ్చీపోయే మనుషులకు కడియం కావాలంటే నీటిలో మునగాలి అని ఆశ పెట్టేదట. ఈ పులిని నమ్మితే తినేస్తుంది అని అందరూ నమ్మకుండా పోయారు' అని కథ చెప్పుకొచ్చారు. 'నేను అడవిలో నలభై ఏళ్ల ఇండస్ట్రీ ఉంది. గతంలో బాగా తినేవాడని.. ఇప్పుడు మంచోడినైపోయినని నమ్మించేది.. రామా.. కృష్ణా.. అంటూ మంచి కార్యక్రమాల కోసమే ఉన్నాను అని చెప్పేది. నమ్మిన వాళ్లు మడుగులో వెళ్లి నీట మునిగి ఆ నగలు తీసుకునే ప్రయత్నం చేసేవాళ్లు..

తరువాయి 2లో..

## ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదల..



విజయవాడ, (విజయభాను న్యూస్) : ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలను విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ బుధవారం విడుదల చేశారు. ఒకేసారి ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ ఫలితాలను కేవలం 22 రోజుల వ్యవధిలో విద్యాశాఖ విడుదల చేసింది. మార్చి 15 నుంచి ఏప్రిల్ 4 వ తేదీ వరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు పరీక్షలు జరిగాయి. 4,84,197 మంది విద్యార్థులు ఇంటర్ ఫస్టియర్, 5,19,793 మంది విద్యార్థులు సెకండియర్ పరీక్షలకు హాజరయ్యారు. ఇంటర్ ఫస్టియర్ పరీక్షల్లో 61 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఇంటర్ సెకండియర్ పరీక్షల్లో 72 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ పరీక్షల్లో బాలుర కంటే బాలికలదే పైచేయి అయ్యింది.

కృష్ణా జిల్లా ఫస్ట్ ఇంటర్ ఫస్టియర్ పరీక్షల్లో 77 శాతం ఉత్తీర్ణతతో కృష్ణా జిల్లా ఫస్ట్, 70 శాతం ఉత్తీర్ణతతో పశ్చిమగోదావరి జిల్లా సెకండ్, 68 శాతం ఉత్తీర్ణతతో గుంటూరు జిల్లా థర్డ్‌గా నిలిచింది. ఇంటర్ సెకండియర్ పరీక్షల్లో 83 శాతం ఉత్తీర్ణతతో కృష్ణా జిల్లా ఫస్ట్ సాధించగా, 78 శాతం ఉత్తీర్ణతతో గుంటూరు జిల్లా సెకండ్, 77 శాతం ఉత్తీర్ణతతో పశ్చిమ గోదావరి జిల్లా థర్డ్‌గా నిలిచింది. ఇంటర్ ఫస్టియర్ లో బాలురు 58%, బాలికలు 65 % ఉత్తీర్ణులవ్వగా, ఇంటర్ సెకండియర్ లో బాలురు 68% , బాలికలు 75% ఉత్తీర్ణులయ్యారు.

**మే 24 నుంచి జూన్ 1 వరకు సప్లిమెంటరీ పరీక్షలు**

ఫలితాలపై రీవెరిఫికేషన్ కి మే 6 లోపు అప్లై చేసుకోవాలని మంత్రి బొత్స తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి జూన్ 1 వరకు, ప్రాక్టికల్స్ మే 6 నుంచి జూన్ 9 వరకు జరుగుతాయని ఆయన వెల్లడించారు. మే 3 లోపు సప్లిమెంటరీ పరీక్షలకి ఫీజు చెల్లించుకోవాలని, విజయనగరం జిల్లాలో ఫలితాలు తగ్గడంపై సమీక్షిస్తామని మంత్రి అన్నారు.

## విశాఖ బీచ్‌లో యువతి మృతదేహం లభ్యం

### మృతురాలిని శ్వేతగా గుర్తించిన పోలీసులు

### భర్తకు ఆల్ ది బెస్ట్ చెప్పి మరీసూసైడ్



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : విశాఖలో దారుణం జరిగింది. Ymca బీచ్‌లో అనుమానాస్పద స్థితిలో యువతి మృతదేహం కలకంరేపింది. దారుణమైన స్థితిలో డెడ్‌బాడీ ఒడ్డున ఉంది. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు.. మృతురాలిని పెద

తరువాయి 2లో..

## ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఘాతుకం

### 10 మంది పోలీసుల మృతి

### తీవ్రంగా ఖండించిన మోదీ..



దంతేవాడ: ఛత్తీస్‌గఢ్ లోని బస్తర్ జిల్లాలో మావోయిస్టులు ఘాతుకానికి పాల్పడ్డారు. దంతేవాడలో పోలీసుల వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని మందుపాతరతో పేలుడు జరిపారు. ఈ ఘటనలో 10 మంది పోలీసులు, డ్రైవర్ ప్రాణాలు కోల్పోయారు.

దంతేవాడ అడవుల్లో మావోయిస్టులు నక్కినట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం రావడంతో ఈ ఉదయం డిస్ట్రిక్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ) ప్రత్యేక యాంటీ-నక్సలైట్ ఆపరేషన్ చేపట్టారు. ఆ ఆపరేషన్ ముగించుకుని మినీ వ్యాన్‌లో తిరిగివస్తుండగా మావోయిస్టులు ఐఈడీతో దాడి చేసి వ్యాన్‌ను పేల్చేశారు. ఈ ఘటనలో 10 మంది పోలీసులు, వ్యాన్ డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందారు. మరికొందరు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఘటన నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్ ఐజీ అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. కాగా.. భద్రతా బలగాలపై దాడులు చేస్తామని నక్సల్స్ పేరుతో గతవారం పోలీసులకు ఓ బెదిరింపు లేఖ వచ్చింది. దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈలోపే ఈ దుర్ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేశ్ భగేల్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన చాలా దురదృష్టకరమన్న ఆయన మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. దాడికి పాల్పడిన నక్సల్స్ ను ఉపేక్షించేది

తరువాయి 2లో..

## మోదీలా ఉండటం వేరేవారికి చాలా కష్టం : అమిత్ షా

### స్మారక నాణేన్ని విడుదల చేసిన అమిత్ షా

ప్రజాస్వామ్యంలో అనేక మాస్ కమ్యూనికేషన్ మాధ్యమాలు ఉన్నాయని.. మాస్ కమ్యూనికేషన్ కోసం ప్రధాని మోదీ ఆల్ ఇండియా రేడియోను ఎంచుకున్నారని అమిత్ షా వ్యాఖ్యానించారు. తాను చిన్నప్పటి నుంచి ఆల్ ఇండియా రేడియోకి పెద్ద అభిమానిని అని చెప్పారు. ఆల్ ఇండియా రేడియోలో చాలా ముఖ్యమైన విషయాలు విన్నానని.. ముఖ్యంగా బంగ్లాదేశ్‌పై భారత్ విజయం గురించి విన్నది ఎప్పటికీ మర్చిపోలేనని స్పష్టం చేశారు. ఎమర్జెన్సీ తర్వాత ఇందిరాగాంధీ ఓడిపోయారంటూ.. తెల్లవారుజామున 5 గంటలకు ఆకాశవాణి బులెటిన్‌లో విన్న విషయాన్ని అమిత్ షా గుర్తు చేసుకున్నారు. ఈ వేదిక ద్వారా.. దేశ శక్తిని సంఘటితం చేసే పని జరిగిందన్నారు. ప్రధాని మోదీ మన ప్రజాస్వామ్యానికి 2 ప్రధాన సహాయాలు చేశారని షా వ్యాఖ్యానించారు. ఒకటి..

తరువాయి 2లో..




## వసతి దీవెన క్రింద జిల్లాకు రూ.41.17 కోట్లు

### 43,938 మంది విద్యార్థులకు ప్రయోజనం



విశాఖపట్నం, (విజయభాను న్యూస్) : జగనన్న వసతి దీవెన క్రింద రాష్ట్ర ముఖ్య మంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి జిల్లాలో 41.17కోట్ల రూపాయలు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేశారు. బుధవారం అనంతపురం జిల్లా, నార్పల లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ముఖ్యమంత్రి వె.యస్.జగన్మోహన్ రెడ్డి వర్చువల్ విధానం ద్వారా 2022-23 విద్యా సంవత్సరం సంబంధించి తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి ప్రారంభించగా, జిల్లా స్థాయిలో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించిన అనంతరం విశాఖపట్నం జిల్లాలో జిల్లా వ్యాప్తంగా రూ.41,17,45,000 మొత్తాన్ని మెగా చెక్కు రూపంలో జిల్లా కలెక్టర్ డా.ఏ.మల్లిఖార్జున ప్రజా ప్రతినిధులతో తో కలిసి లబ్ధిదారులకు అందజేసారు. తదుపరి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న వసతి దీవెన క్రింద జిల్లాలో ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేషన్, ఇతర ప్రొఫెషనల్ కోర్సులు

తరువాయి 2లో..

# ఘనంగా ఏయూ వ్యవస్థాపక దినోత్సవం

–కట్టమంచి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు –పెద్దసంఖ్యలో హాజరైన ఏయూ ఆచార్యులు, ఉద్యోగులు



సాగర్‌నగర్ **(విజయభాను న్యూస్) :** ఆంధ్రవిశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఏయూ పరిపాలనా భవనం వద్దనున్న వ్యవస్థాపక ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహానికి ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఆంధ్రవిశ్వవిద్యాలయం ఏర్పాటుకు అసెంబ్లీలో బిల్లు పెట్టిన ఏ.పి పాత్రో విగ్రహానికి, ఏయూ చిహ్నానికి పూలమాల వేసారు. శతాబ్దానికి చేరువవుతున్న ఆంధ్రవిశ్వవిద్యాలయం అభ్యున్నతికి ఆచార్యులు, ఉద్యోగులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఏయూ స్నాతకోత్సవ మందిరం, సిరిపురం కూడలి వద్దనున్న సి.ఆర్ రెడ్డి విగ్రహాలకు ఏయూ అధికారులు, ఉద్యోగులు పూలమాలలు వేసారు.

కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్స్ ఏ.నరసింహా రావు, కె.శ్రీనివాస రావు, వై.రాజేంద్ర ప్రసాద్, వి.విజయలక్ష్మి, టి.శోభశ్రీ, కె.విశ్వేస్వర రావు, ఎస్.కె భట్టి, మీడియా రిలేషన్స్ డైరెక్టర్ ఆచార్య చల్లా రామకృష్ణ, డీన్‌లు, డైరెక్టర్‌లు, అధికారులు, ఆచార్యులు, ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## అమెరికా తానా తెలుగు మహాసభలకు ఆహ్వానం అందుకున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



విశాఖపట్నం, **(విజయభాను న్యూస్) :** ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) తరుపున ఫిలడెల్ఫియాలోని పెన్సిల్వేనియా కన్వెన్షన్ సెంటర్ లో ఈ ఏడాది జూలై 7వ తేది నుంచి 9 వ తేది వరకు జరగబోయే తెలుగు మహా సభలకు ఆహ్వానాన్ని విశాఖ నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అందుకున్నారు. ఈ మేరకు బుధవారం(తానా) సంఘం ప్రతినిధులు జియ్యాని శ్రీధర్ కు తానా సభలకు రమ్మని ఆహ్వాన పత్రికను పంపారు. ఈ సందర్భంగా జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ ప్రతీ ఏడాది సుమారు 15,000 మంది, రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అనేక మంది కళాకారులు, చిత్రకారులు, నృత్యకారులు, గాయకులు, రచయితలు, సిని కాళాకారులు, వ్యాపార వేత్తలు, ఆధ్యాత్మిక నాయకులు, వైద్యులు, ఇంజనీర్లు, రాజకీయ నాయకులు మొదలైన వారందరూ కలసి సమావేశమై ఒకరినొకరు సంభాషించుకోవటానికి ఏర్పచుకునే వేదికగా తానా సభలని నిర్వహిస్తున్నారన్నారు. తానా మహా సభల ద్వారా ప్రతీ ఏటా సుమారు 16.45 కోట్లు వెచ్చించి ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణా రాష్ట్రాలలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి చక్కటి కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించిన తానా సంఘం పెద్దలకు కృతజ్ఞతలు జియ్యాని శ్రీధర్ తెలిపారు.

## ప్రతిష్టాత్మకమైన "పుదువై కలైమామణి" అవార్డు






యానాం : పుదుచ్చేరి కళలు సాంస్కృతిక శాఖ రాష్ట్రవ్యాప్తంగా వివిధ కళా రంగాల్లో విశిష్టమైన కృషి చేసిన వారికి ఇచ్చే ప్రతిష్టాత్మకమైన "పుదువై కలైమామణి" అవార్డు ఈసారి యానాం నుండి నలుగురిని ప్రకటించడం జరిగింది. స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. వరుగు భాస్కరరెడ్డి గారికి సాహితీ రంగం నుండి, విశ్రాంత జే ఈ శ్రీ కోరుకొండ ప్రసాదరావు గారికి నాటకరంగం నుండి, స్థానిక రాజీవ్ గాంధీ ప్రభుత్వ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ నందు ఫైన్ ఆర్ట్స్ టీచర్ గా పనిచేస్తున్న శ్రీ ముమ్మిడి శ్రీ వీర నాగ ప్రసాద్ (చిన్నారి) మరియు అద్దాల పై చక్కని చిత్రాలు చెక్కే సీనియర్ ఆర్టిస్టు శ్రీ గ్రంధి సత్యనారాయణ (సత్తి పండు) లకు చిత్రకళ మరియు శిల్పరంగం నుండి ఎంపిక కాగా వీరికి శాసనసభ్యులు శ్రీ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ప్రాంతీయ పరిపాలనాధికారి శ్రీ ఆర్. మునిస్వామి అభినందనలు తెలిపారు. 29 వ తేదీన పుదుచ్చేరి లో ముఖ్యమంత్రి సమక్షంలో జరగబోయే ఈ అవార్డు ప్రధాన కార్యక్రమంలో ఈ నలుగురూ పాల్గొన బోతున్నారు.

## పారిశుద్ధంపై దృష్టి సారించండి

### – దాసరి శ్రీనివాస్



మధురవాడ (విజయభాను న్యూస్) : పేరులోనే మధురం ఉంది కానీ వాస్తవంలో లేదని విశాఖ పార్లమెంటరీ అధికార ప్రతినిధి, 6వ వార్డ్ టీడీపీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ అన్నారు. మహావిశాఖ 5,6,7 వార్డులకు సంబంధించి పారిశుధ్యం చాలా అధ్వానంగా ఉందని జీవీఎంసీ అధికారులు తగు చర్యలు చేపట్టకపోవడంతో పలు ప్రాంతాల్లో విచ్చలవిడిగా పందులు, గుంపులు గుంపులుగా కుక్కలు, రోడ్డుపైనే ఆవులు గేదెలు సంచరిస్తున్నాయని వీటి మూలంగా వాహనదారులు, పాదచారులు తరచుగా ప్రమాదాలకు గురి కావడమే కాకుండా వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తూతూ మంత్రంగా పందుల నిర్మూలనకు చర్యలు చేపడుతున్నారని అలా కాకుండా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని కోరారు. వార్డులో అనేకచోట్ల చెత్తాచెదారాలతో కాలువలు నిండిపోయాయని అదేవిధంగా అవసరమైన చోట్ల బ్లీచింగ్ అలాగే దోమల నివారణ కొరకు ఫాగింగ్ చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులకు, సచివాలయం సిబ్బందికి చెత్త పన్ను వసూలు పై ఉన్న శ్రద్ధ పారిశుధ్య పరిరక్షణపై లేదని మండిపడ్డారు. మరోపక్క కరోనా ప్రబలే అవకాశం ఉంది కనుక ఇప్పటికైనా జోనల్ అధికారులు వెంటనే స్పందించి పారిశుద్ధ్యం క్షీణిస్తున్న ప్రాంతాల్లో పర్యటించి తగు చర్యలు చేపట్టాలని కోరారు.

## భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించండి


### – జివిఎంసి కమిషనర్ సీ ఎం సాయికాంత్ వర్మ



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** వార్డులలో చాలా చోట్ల భవన నిర్మాణ వ్యర్థాలు ఉన్నాయని వాటిని యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని జివిఎంసి కమిషనర్ సీ ఎం సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా 3వ జోన్, 19వ వార్డు పరిధి లోని లాస్సెన్స్ బే కాలనీలో సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డులో చెత్తతోపాటు భవన నిర్మాణ వ్యర్థాలు అధికంగా కనిపిస్తున్నాయని, వాటిని యుద్ధ ప్రాతిపదికన తొలగించాలన్నారు. "క్లాప్" వాహనాల ద్వారా చెత్త సేకరణ పక్కాగా జరుగుతున్నప్పుడు వ్యర్థాలు గుట్టలు గుట్టలుగా రోడ్డుపై ఎందుకుంటుందని శానిటరీ ఇన్స్పెక్టర్ ని ఆరా తీశారు. సచివాలయ శానిటరీ కార్యదర్శులు వారి పరిధిలో వ్యర్థాలు లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఎంవిపి రైతుబజార్ వద్ద ఫుట్ పాత్ ను దాటి దుకాణదారులు ఆక్రమణలు చేపడుతున్నారని వాటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం, ఐటి సెజ్ ప్రాంతాన్ని పరిశీలించారు. రోడ్లు స్లీపింగ్ సరిగా చేయడం లేదని, ప్రధాన రోడ్లతో పాటు వీధి రోడ్లు కూడా అపరిశుభ్రంగా ఉన్నాయని, రోడ్డుకు ఇరువైపులా భవన నిర్మాణ వ్యర్థాలతో పాటు పిచ్చి మొక్కలు అధికంగా ఉన్నాయని, ఈ ప్రాంతం పై ప్రత్యేక దృష్టి సారించి శుభ్రపరచాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కలు చాలా వరకు ఎండిపోయాయని వాటి స్థానంలో కొత్త మొక్కలు వేయాలన్నారు.

ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

### ఉభయ గోదావరిజిల్లాల వైకాపా యువజన విభాగం రీజనల్ కోఆర్డినేటర్ గా జక్కంపూడి గణేష్...



కాకినాడ రూరల్ : ఉభయ గోదావరిజిల్లాల వైకాపా యువజన విభాగం రీజనల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్,

కాకినాడ జిల్లా వైకాపా యువజన విభాగం అధ్యక్షుడు కోప్పన శివనాథ్ పదవి చేపట్టిన సందర్భంగా బుధవారం మాజీమంత్రి

ఎమ్మెల్యే కురసాల కన్నబాబును మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం కన్నబాబు ఇరువురికి గజమాలవేసి, దుస్సాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టం పనిచేసే వారికి జగనన్న న్యాయం చేస్తారని అనడానికి ఇదే నిదర్శనం అన్నారు.

మొదటి పేజీ తరువాయి

## వసతి దీవెన క్రింద జిల్లాకు రూ.41.17 కోట్లు

చదువుకుంటున్న విద్యార్థులకు స్కాలర్ షిప్లు లభించాయని తెలిపారు. విశాఖపట్నం జిల్లాకు 43,938 మంది విద్యార్థులకు సంబంధించి వారి తల్లుల బ్యాంకు ఖాతాల్లో 41.17 కోట్ల రూపాయలు జమ చేసినట్లు తెలిపారు. ఇందులో 4,238 మంది ఎస్.సి విద్యార్థులు వారి తల్లుల ఖాతాల్లో 3.95 కోట్ల రూపాయలు, 168 మంది ఎస్.టి విద్యార్థుల తల్లులు ఖాతాల్లో 15.52లక్షలు, 38,109 మంది బి.సి విద్యార్థుల తల్లులు ఖాతాల్లో రూ.35.72 కోట్లు, 1,423 మంది మైనారిటీ విద్యార్థుల తల్లులు ఖాతాల్లో రూ.1.34 కోట్ల రూపాయలు జమ చేసినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులకు వసతి దీవెన కు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే సచివాలయం లో ఉండే సంబంధిత అధికారులకు తెలియజేసినట్లు అయితే వారు పరిష్కరిస్తారన్నారు.

జిల్లా నుండి ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.యస్ విశ్వనాథన్, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రమణ మూర్తి, జిల్లా బి. సి సంక్షేమాధికారి శ్రీదేవి, డిసిఎంఎస్ చైర్ పర్సన్ పల్లా చిన్నతల్లి, నగరాల కార్పొరేషన్ చైర్ పర్సన్ పిళ్ళా సుజాత , రెల్లి కార్పొరేషన్ చైర్మన్ మధుసూదన్ , యాత కార్పొరేషన్ చైర్ పర్సన్ పిళ్ళా సుజాత నూకరాజు , నాగవంశం సంక్షేమ కార్పొరేషన్ చైర్ పర్సన్ అప్పలకొండమ్మ , పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఘాతుకం

లేదన్నారు. మరోవైపు, ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరా తీశారు. ముఖ్యమంత్రి భగేల్‌తో ఆయన ఫోన్లో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వానికి అన్ని విధాలా అండగా ఉంటామని అమిత్ షా హామీ ఇచ్చారు.

50కేజీల ఐఈడీ..

ఈ ఘటనకు సంబంధించి కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పోలీసులపై దాడి చేసేందుకు నక్సల్స్ 50 కేజీల ఐఈడీ ని ఉపయోగించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇక, పోలీసులు ప్రయాణించిన మినీ వ్యాన్‌ను అద్దెకు తీసుకున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి.

తీవ్రంగా ఖండించిన మోదీ..

ఘటనపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మావోయిస్టుల ఘాతుకాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ దాడిలో అమరులైన పోలీసులకు నివాళులర్పించారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి త్యాగం ఎన్నటికీ గుర్తుండిపోతుందన్నారు.

## విశాఖ బీచ్‌లో యువతి మృతదేహం లభ్యం

గంట్యాడలో ఉండే శ్వేతగా గుర్తించారు. అనుమానాస్పద మరణంగా కేసు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తు చేస్తున్నారు. శ్వేతకు వివాహంకాగా.. భర్త హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నట్లు చెబుతున్నారు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఆమె భర్తతో చివరిగా కాల్ మాట్లాడినట్లు చెబుతున్నారు. పోలీసులు పెద గంట్యాడలో ఉండే శ్వేత అత్తింటివారిని ప్రశ్నిస్తున్నారు. అయితే యువతి ఒంటిపై దుస్తులు లేకపోవడంతో శ్వేత మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. న్యూ పోర్టు పోలీస్ స్టేషన్‌లో ఆమె కనిపించడం లేదంటూ అత్తింటివారు ఫిర్యాదు చేయగా.. కేసు కూడా నమోదైంది. ఇంతలోనే బీచ్‌లో ఆమె మృతదేహాన్ని గుర్తించారు. యువతి చనిపోయిన తర్వాత అర్ధరాత్రి మృతదేహం ఒడ్డుకు కొట్టుకు వచ్చి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇంట్లో నుంచి బయటకు వచ్చే ముందు శ్వేత తన భర్తను ఉద్దేశించి రాసిన లేఖ బయటకు వచ్చింది. నువ్వెప్పుడూ నేను లేకపోయిన బిందాస్‌గా ఉండగలవు. నీకు ఏమాత్రం ఫరక్ పడదని నాకు ఎప్పుడో తెలుసు. ఏమైతేనేం నీ భవిష్యత్తుకు, నీ కొత్త జీవితానికి ఆల్ ది బెస్ట్. చాలా మాట్లాడటానికి ఉన్నా కూడా నేను ఏమీ మాట్లాడలేదు. ఎందుకంటే నువ్వు బయటకు ఒప్పుకున్నా.. ఒప్పుకోకున్నా నీకు అంతా తెలుసు. నిన్ను నువ్వు ప్రశ్నించుకో. ఏ బిగ్ థ్యాంక్స్ ఫర్ ఎవ్రీ థింగ్' అని లేఖ రాసి మరీ శ్వేత ఆత్మహత్యకు పాల్పడింది. తాను ఉద్యోగం కోసం రెండు నెలల క్రితమే హైదరాబాద్‌కు వచ్చి హాస్టల్లో ఉంటున్నానని.. మరో రెండు నెలలు ఆగితే ఇక్కడికి షిఫ్ట్ అవుదామని చెప్పానని.. శ్వేత తనతో మాట్లాడొద్దని చెప్పిందని.. తాను చాలాసార్లు తనకు ఫోన్ చేశానని.. మెసేజ్‌లు కూడా పెట్టానని ఆమె భర్త తెలిపాడు. శ్వేత ఐదు నెలల గర్భిణి అని.. తొందరపాటులో రెండు జీవితాలు ముగిసిపోయాయని అతడు వాపోయాడు.

కాగా శ్వేత తల్లి మాత్రం ఆమె అత్తింటి వారే ఆత్మహత్యకు కారణమని ఆరోపిస్తోంది. తమ అమ్మాయి సివిల్స్ కోచింగ్ తాము ఇప్పిస్తామని చెప్పారని.. ముందుగా ఒప్పుకోకున్నా సరే వాళ్లే ఒప్పించి మరీ పెళ్లి చేసుకున్నారని.. కానీ ఏడాది తిరిగే సరికే తన బిడ్డ ఇలా విగత జీవిగా మారిందని ఆమె వాపోయింది.

## రాష్ట్రంలో నాణ్యమైన చదువుల కోసం విప్లవాత్మక మార్పులు

వాళ్లను పులి చంపేసి తినేసేది' అని కథను వివరించారు. వెన్నుపోటు పొడిచేవాళ్లను, అబద్ధాలు చెప్పేవాళ్లను ఎట్టిపరిస్థితుల్లో నమ్మకూడదు అన్నారు.. ఇదంతా వింటే అబద్ధాలు కళ్లారప్పకుండా చెప్పే ఓ ముసలాయాన చంద్రబాబు అంటూ ఎద్దేవా చేశారు. చంద్రబాబు జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూ చూస్తే తనకు పంచతంత్ర కథలు గుర్తుకొచ్చాయన్నారు. రోజూ రాజకీయాల మధ్య బతుకున్నామని.. చంద్రబాబు అధికారంలోకి వచ్చి రైతుల్ని నిండా ముంచేశారన్నారు. అక్కాచెల్లెమ్మల పొదుపు రుణాలు మాఫీ పేరుతో మోసం చేశారన్నారు. చంద్రబాబు మళ్లీ మోసం చేసేందుకు ప్రజల్లోకి వస్తున్నారని.. రాబోయే రోజుల్లోమరిన్ని అబద్ధాలు చెబుతారన్నారు. జగన్ వల్ల మంచి జరిగిందా? లేదా? అనేది కొలమానంగా తీసుకోవాలన్నారు. తాను దేవుడి దయను, ప్రజలను నమ్ముకున్నాను అన్నారు. రాబోయే ఎన్నికల కురుక్షేత్రంలో అందరి దీవెనలు కావాలని కోరారు.

రాష్ట్రంలో నాణ్యమైన చదువుల కోసం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామన్నారు సీఎం జగన్. గత ప్రభుత్వానికి.. ఈ ప్రభుత్వానికి తేడాను గమనించాలని కోరారు. ప్రభుత్వ విద్యాసంస్థలు ప్రైవేట్ విద్యాసంస్థలతో పోటీ పడే పరిస్థితి తెచ్చామని.. పేదలకు పెద్ద చదువులు అందించాలనేది ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ప్రతీ మూడు నెలలకు తల్లుల ఖాతాలో నగదు జమ చేస్తున్నామని.. ఈ ప్రభుత్వం వచ్చాక డ్రాపవుట్ల సంఖ్య తగ్గిందన్నారు.

## మోదీలా ఉండటం వేరేవారికి చాలా కష్టం : అమిత్ షా

కులతత్వం, బంధుప్రీతి, బుజ్జగింపుల నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థను విముక్తం చేశారని.. రెండోది.. పద్మ అవార్డులను ప్రజాస్వామ్యీకరించారని అమిత్ షా వివరించారు.

గతంలో పద్మ అవార్డులు సిఫారసుపై ఇచ్చేవారని అమిత్ షా ఆరోపించారు. కానీ.. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. పనితీరు మాత్రమే ప్రమాణంగా ఇస్తున్నట్టు వెల్లడించారు. ఇటు మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా.. సమాజంలో చిన్న చిన్న ప్రయోగాలు చేసే వ్యక్తులకు గుర్తింపు వచ్చిందని అమిత్ షా వివరించారు. ఆల్ ఇండియా రేడియోను పునరుద్ధరించిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. తన కమ్యూనికేషన్ స్కిల్స్‌ను బాగా ఉపయోగించారని అమిత్ షా కొనియాడారు. ఇంత పర్ఫెక్ట్ కమ్యూనికేషన్ స్కిల్స్ ఏ నాయకుడిలో చూడలేదన్నారు. మండేలా రేడియో సందేశం కావచ్చు.. చర్చిల్ రేడియో సందేశం కావచ్చు.. ఎక్కడో ఒకచోట రాజకీయాలు ఉన్నాయి. కానీ ప్రధాని మోదీ 99 ఎపిసోడ్‌లలో రాజకీయాలు అస్సలు లేవని గుర్తు చేశారు అందుకే. మన్ కీ బాత్ పాన్ ఇండియా స్థాయిలో ప్రాచుర్యం పొందిందని వివరించారు. దేశం నలుమూలల నుంచి ప్రజలు ఈ కార్యక్రమాన్ని విన్నారని చెప్పారు.

# సేతు కార్యక్రమం ద్వారా ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు



కొయ్యూరు (విజయభాను న్యూస్) : అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో సేతు కార్యక్రమం ద్వారా కొయ్యూరు మండలం శరభన్నపాలెం ఎర్రగొండమ్మ పండుగ సందర్భంగా ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని కొయ్యూరు సిఐ స్వామినాయుడు తెలిపారు. కొత్తగా ఆధార్ నమోదుతో పాటు కార్డులో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చునన్నారు. మరో రెండు రోజుల పాటు ఆధార్ కేంద్రం అందుబాటులో ఉంటుందని,ఈ అవకాశాన్ని పరిసర గ్రామాల ప్రజలు వచ్చి ఆధార్ నమోదు చేసుకోవాలని వారు సూచించారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ మేళా చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు ఎస్సై రాజా రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి డాక్టర్ కందుల ఆర్థిక సహాయం



**విశాఖపట్నం, విజయభాను న్యూస్ :** దక్షిణ నియోజక వర్గం 41 వ వార్డులో మృతి చెందిన బుర్ర జయరాజు కుటుంబానికిజనసేన దక్షిణ నియోజకవర్గం నాయకులు, 32వ కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు ఆర్థిక సహాయం అందజేశారు.చనిపోయిన విషయం తెలుసు కున్న వెంటనేడాక్టర్ కందుల నాగరాజు స్పందించారు. ఆ కుటుంబానికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ కుటుంబానికి అండగా నిలవడం తన బాధ్యతని చెప్పారు. నియోజక వర్గంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా తను అందుబాటులో ఉంటానని తెలిపారు.మంచి పనులకు తాను ఎప్పుడు సిద్ధంగా ఉంటానని పేర్కొన్నారు. ఎటువంటి స్వలాభ పేక్ష లేకుండా సాయం చేయడం మాత్రమే తనకు తెలుసని చెప్పారు. ఈ కార్యక్రమంలో...

41 వ వార్డు జనసేన నాయకులు అంతోని శేఖర్, దేవి, ప్రసాద్, బద్రీనాథ్, కేదార్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

# చలివేంద్రంను ప్రారంభించిన సుందరపు



అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : మండల కేంద్రమైన అచ్యుతాపురం నాలుగు రోడ్ల కూడలిలో బుధవారం జనసేన యలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జ్ సుందరపు విజయ్ కుమార్ చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలకు , గ్రామాల నుండి వచ్చే ప్రజలకు వేసవి తాపానికి దాహం తీర్చాలనే చలివేంద్రం ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో జన సేన మండల కన్వీనర్ బైలపూడి రామదాసు, బొందల శ్యామ్, వడిశల నాయుడు, బొందల సింహాచలం జనసేన నాయకులు పాల్గొన్నారు.

## ఇంటి పట్టాలు కన్వీయన్స్ డీడ్ కు మే 25 ఆఖరుతేదీ

**భీమునిపట్నం, విజయభాను న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వం గతం లో జారీ చేసిన 388జిఓ ప్రకారం ఇంటి పట్టాల క్రమబద్ధీకరణ లో భాగంగా ఇవ్వబడిన పట్టాలను ఇటీవల నూతన జిఓ ద్వారా ప్రభుత్వం కన్వీయన్స్ డీడ్ చేయడానికి మే 25 వరకు సంబందిత సచివాలయంలో అందుబాటులో ఉంచినట్లు ఆర్డీవో భాస్కర్ రెడ్డి చెప్పారు. కన్వీయన్స్ డీడ్ చేసే ముందు మరియొకసారి సదరు పట్టాలనందు పేరు అడ్రస్,సీరియల్ నెంబర్,ఎక్స్టెంట్ కరప్షన్, డెత్ కేసులు ఉంటే ఇతర కుటుంబ సభ్యులకు మార్చడం ,ఫొటో మారిపోతే మార్చడం వంటివి ముందుగానే చేపట్టి తప్పులు లేకుండా ఏప్రిల్ 26 నుండి మే 25 వరకు నెల రోజులపాటు సంబందిత సచివాలయాలలో అందుబాటులో వుంచనున్నట్లు తెలిపారు. 388 జిఓ పట్టాదారులు తమ పట్టాలను పరిశీలించుకుని వాటిలో ఏమైనా తప్పులు ఉన్నయెడల సవరించుకోవడానికి దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

# ప్రారంభానికి సిద్ధమైన బాలికల వసతి గృహం

గాజువాక (విజయభాను న్యూస్ ): జీవీఎంసీ 74 వ వార్డు దయాల్ నగర్ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహం పునః నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ తిప్పల వంశీరెడ్డి వార్డు అధ్యక్షులు ఎన్ వై నాయుడు, వసతి గృహ సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. గురువారం జిల్లా కలెక్టర్ మల్లికార్జున్ చేతులమీదుగా ప్రారంభానికి సిద్ధంగా ఉండడంతో పనులన్నీ సక్రమంగా జరిగాయా లేవా విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు సంపూర్ణంగా ఉండాలని వంశీరెడ్డి చెప్పేరు.

## అమ్మవారి పండుగ మహొత్సవానికి మేయర్‌కు ఆహ్వాన పత్రికను అందజేసిన బీసీ సెల్ అధ్యక్షులు మన్యాల శ్రీనివాస్



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : 29వ వార్డు అంగటి దిబ్బ మరియు రామజోగి పేట ప్రాంతంలో వేంచేసి వున్న శ్రీ శ్రీ శ్రీ పోలమ్మ, ముత్యాలమ్మ, నూకాలమ్మ అమ్మవార్ల 23వ జాతర మహొత్సవముల ఆహ్వాన పత్రికను విశాఖ దక్షిణ శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్ మరియు గౌరవ మేయిర్ గొలగాని హరి వెంకట కుమారి శ్రీనివాస్, విఎంఆర్డీఏ ఛైర్మన్ అక్కరమాని విజయ నిర్మల వెంకటరావు, సీతంరాజు సుధాకర్, డిప్యూటీ మేయర్ శ్రీధర్, మహారాణి పేట సీఐలకు ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా అమ్మవారి పండుగ మహొత్సవానికి ఆహ్వానం పలుకుతున్న విశాఖ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు మన్యాల శ్రీనివాస్. ఈ సందర్భంగా పైన కలిసిన ప్రముఖులు మాట్లాడుతూ గ్రామ దేవతలు పండుగలు జరుపుకోవడం మనకి అనాదిగా వస్తున్న ఆచారాలు అని తప్పకుండ అమ్మవారి పండుగ మహొత్సవానికి విచ్చేసి తమవంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో హరి, జీవన్, తేజ, నరేష్, మోహన్ రావు, చిన్నారావు, రాజేష్, ఉమ శంకర్, దిలీప్, పుచ్చ వాసు, సాయి కుమార్, భరత్ సాయి, వర్ధన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## బైక్ ఢీకొని వ్యక్తి కి గాయాలు

భీమునిపట్నం, విజయబాను న్యూస్ : బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. స్థానిక యాత కుమ్మరి పాలెం కు చెందిన గుడివాడ సూరిబాబు (35) ఈనెల 24 న సాయంత్రం భీమిలి అపార్ట్ మెంట్ లో పనిచేస్తున్న తన భార్యను ఇంటికి తీసుకుని వద్దామనీ టివిఎస్ 50 పై వెళు తుండగా భీమిలి అగ్రికల్చరర్ ఆఫీస్ కమిటీ వద్దకు రాగానే తగరపువలస నుంచి వేగంగా బైక్ పై వస్తూ సూరిబాబును ఢీకొనడంతో సూరిబాబు కాలుకు తీవ్ర గాయాలయ్యాయి.

# పట్టణంలో మా నమ్మకం నువ్వే జగన్



**మాదికవీధిలో మా నమ్మకం నువ్వే జగన్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు**

రాజాం (విజయభాను న్యూస్) : రాజాం పట్టణంలో పలువార్డుల్లో బుధవారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందించిన సంక్షేమాన్ని వివరించారు. అనంతరం ఆయా లబ్దిదారుల ఇండ్లకు స్టిక్కర్లు అంటించారు.

ఈకార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, నల్లా శ్రీనివాసరావు, వంజరాపు విజయ్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధి పట్ల నిర్లక్ష్యం వద్దు

### క్షయ వ్యాధి నివారణాధికారి విశ్వేశ్వరరావునాయుడు



**కొయ్యూరు, విజయభాను న్యూస్ :** క్షయ వ్యాధిని నిర్లక్ష్యం వద్దు అని జిల్లా క్షయ వ్యాధి నివారణాధికారి టి.విశ్వేశ్వరరావు నాయుడు అన్నారు. కొయ్యూరు మండలం రాజేంద్ర పాలెం పిహెచ్‌సిని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తించిన వ్యాధిగ్రస్తులకు ప్రతిరోజు పరీక్ష నిర్వహించి డాక్టర్ పర్య వేక్షణలో ఉంచాలన్నారు.

క్షయ వ్యాధి ప్రాణాంతకమైన వ్యాధిగాను, వ్యాధి నిర్ధారణ, రోగి పట్ల వైద్య సిబ్బంది తీసుకోవలసిన అనేక జాగ్రత్తల గురించి వైద్య సిబ్బందికి, అవగాహన అవగాహన కల్పించారు. విపరీతంగా దగ్గు రావడం రెండు మూడు వారాలైనా తగ్గక పోవడం, రాత్రిపూట జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు రోగిలో కనిపిస్తే, క్షయ వ్యాధిగా అనుమానించి తక్షణమే పరీక్ష నిర్వహించాలని, వైద్య సిబ్బందికి ఆయన సూచించారు.

ఈ కార్యక్రమంలో డిపిసి శ్రీనివాస్, టిబి కన్సల్టెంట్ విగ్నేష్, పిహెచ్‌సి డాక్టర్లు సంపత్ బాబు, మనోజ్, ప్రశాంత్, మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధికి కేరాఫ్ వైసీపీ సర్కార్ - కార్పొరేటర్ బట్టు





పరవాడ, విజయభాను న్యూస్ : జివిఎంసి 77వ వార్డులో నాడు-నేడు ఫేజ్-3లో 27.93 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులకు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారం భించారు. .పెద్దపాలెంలో మండలపరిషత్ ప్రాదమిక పాఠశాల15లక్షల 93వేలు రూపాయాలుతో,చిన దేవాడలో మండల పరిషత్ ప్రాదమిక పాఠశాల 12లక్షల రూపాయాలుతో అభివృద్ధి పనులును ప్రారం భించారు.ఈ సందర్భంగా అమె మాట్లడుతూ రాష్ట్రఅభివృద్ధి వైసిపితోనే సాద్యపడుతుంది అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి కిస్మూల్ చైర్మన్ మునీర బేగం, వైస్ చైర్మన్ తస్లీమ బేగం దుశాలువాతో ఘనంగా సత్కరించారు..ఈ కార్యక్రమంలో కె. శివకుమార్, ఎంపీ రెడ్డి,కురం అప్పారావు,కర్రీ అప్పారావు, సూర్యనారాయణ, దాసరి తాతరావు, సావడ అప్పలరెడ్డి, కాసు కుమార్, పైడి రెడ్డి, ఉపాధ్యాయులు, సచివాలయం సిబ్బంది, తథితర్లుపాల్గొన్నారు.

# సిజెఎం లో డబ్బులు రాని కార్మికులు విశాఖ జెసిఎల్ దగ్గరకు బయలుదేరాలి

భీమునిపట్నం, విజయబాను న్యూస్ :

చిట్టి వలస జ్యూట్ లో డబ్బులు రాని కార్మికులు విశాఖ జెసిఎల్ దగ్గరకు వెళ్ళడానికి బయలుదేరాలనీ

ఐక్యకార్యాచరణ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు.అప్లికేషన్ పెట్టు కుని డబ్బులు రానివారు, అప్లికేషన్ పెట్టుకోవలసినవారు

గురువారం ఉదయం 9 గంటలకు చిట్టి వలస జ్యూట్ మిల్లు కాంగ్రెస్ కార్మిక సంఘం ఆఫీస్ వద్ద ఆటోలు పెట్టడం జరిగుతుందని డబ్బులు రానటువంటి కార్మికులు అందరూ తప్పకుండా రావాలని

సిజెఎం కాంగ్రెస్ కార్మిక సంఘం, ఎఐటి యుసి,టిఎన్టియుసి నాయకులు కోరారు.

## ప్రభుత్వ అసమర్థత వల్ల జ్ఞాన దీపక్ అనే విద్యార్థి మృతి

# కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా, ఒకరికి జాబ్ ఇవ్వాలని డిమాండ్

### మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ డిమాండ్...



అల్లూరిజిల్లా. విజయభాను. న్యూస్.. హుకుంపేట మండల కేంద్రంలో హైవే రోడ్డు పనులు చేసే ప్రాంతంలో రోడ్డు చేస్తున్నా పక్కన వాటర్ స్టోరజి కోసం హైవే పనులకు ఉపయోగించడానికి గుంత తియ్యడంతో ఆ ప్రదేశంలో ఎక్కువగా నీరు నిండిపోవడంతో జ్ఞాన దీపక్ అనే విద్యార్థి వయసు 12 సం నీటి గుంతలో పడి మరణించడం జరిగింది విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ అరకు నియోజకవర్గ ఇంచార్జి మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ హుటాహుటిన హుకుంపేట చేరుకునిమృతి చెందిన జ్ఞాన దీపక్ కుటుంబానికి పరామర్శించి కుటుంబనికి దైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చి బాధిత కుటుంబానికి న్యాయం చెయ్యాలని జ్ఞాన దీపక్ కుటుంబానికి కోటి రూపాయలు ఎక్సగ్రెసియా ఇవ్వాలని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని రోడ్డు మీద బైటయించి మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ డిమాండ్ చేసారా అదే విధంగా ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఒక నిండు ప్రాణం పోయిందని కనీసం హైవే రోడ్డు నిర్మాణం పనులకు సంబందించిన హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేయలేని దుస్థితి ఇది కేవలం ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జరిగిందని తక్షణమే బాధిత కుటుంబాన్ని న్యాయం చేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మాజీ మంత్రి తో పాటు హుకుంపేట మండల పార్టీ అధ్యక్షులు కొర్ర తులసిరావు, ప్రధాన కార్యదర్శి సిరాగం సూర్యకాంతం, బకూరు సర్పంచ్ బకూరు వెంకటరమణ రాజు, హుకుంపేట ఎంపీటీసీ కొమ్మ రమ, అడ్డుమాండ ఎంపీటీసీ శెట్టి మహేశ్వరరావు, అండీభ సర్పంచ్ తామర్ల సత్యనారాయణ,దారెల సర్పంచ్ పాంగి పాండురంగస్వామి, సీనియర్ నాయకులు బొడ్డ శ్యామ్,మాజీ ఎంపీటీసీ పొండోయ్ లక్ష్మయ్య, వార్డ్ నెంబర్ వెంకట్, అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## 'మనిషి మెదడు కూడా కంప్యూటర్ వంటిదే.

'మనిషి మెదడు కూడా కంప్యూటర్ వంటిదే. విడిభాగాలు పాడైన తర్వాత కంప్యూటర్ పని చేయటం ఆగిపోయినట్టే మెదడు కూడా ఆగిపోతుంది. ఒక్కసారి మెదడు ఆగిపోయిన తర్వాత ఏమీ ఉండదు. కన్నుమూసేలోపే మనకున్న శక్తిసామర్థ్యాలను పూర్తిస్థాయిలో వినియోగిస్తూ మంచి జీవితం గడపాలి. మనం చేసే పనులు అత్యున్నతంగా ఉండటానికి కృషి చెయ్యాలి. మరణం నాకు అత్యంత సమీపంలోనే ఉంటోంది. అయినప్పటికీ నేను మృత్యువుకు భయపడటం లేదు. త్వరగా మరణించాలనీ భావించటం లేదు. నేను కన్నుమూసేలోపు చేయాల్సిన పనులు ఎన్నెన్నో ఉన్నాయి' అంటారు ప్రముఖ శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్. అంతేకాదు... 'నా శరీరం నిస్సత్తువగా కుర్చీలో కూలబడిపోవచ్చు. కానీ, నా మెదడు విశ్వాంతరాళాల్ని శోధిస్తుంది' అంటారాయన. మనిషికి ఆత్మవిశ్వాసం... తనపై తనకు నమ్మకం వుండటం అవసరం. నేను చేయగలను... సాధించగలను అన్న బలమైన నమ్మిక వుండాలి. ఆత్మవిశ్వాసం మనిషికి దివ్యౌషధం. జీవితం పూలపాన్పు కాదు. నల్లేరు బండి మీద నడక అంతకన్నా కాదు. 'కెరటం నాకు ఆదర్శం... లేచి పడుతున్నందుకు కాదు, పడినా లేస్తున్నందుకు' అంటారు స్వామి వివేకానంద. ఆత్మవిశ్వాసం... మానసిక స్థైర్యంతో అనారోగ్యాన్ని సైతం జయించొచ్చని హాకింగ్ నిరూపించాడు. కెనడాకు చెందిన కాసిడీ మేగాన్ అనే యువతి మూర్ఛ వ్యాధితో తాను ఎదుర్కొన్న పోరాటాల ద్వారా పొందిన ప్రేరణతో 'పర్పుల్ డే' అనే ఒక రోజును సృష్టించింది.

చూడటానికి ఎంతో ఆరోగ్యంగా కనిపిస్తూ... దారిలో నడుచుకుంటూ వెళ్తూ-ఉన్నట్లుండి కింద పడి గిలగిలా కొట్టుకుంటూ ఉండటం, నోటివెంట నురగలు రావడం వంటి సంఘటనలు చాలాసార్లు గమనించి ఉంటాం. ఇలా కింద పడి ఉన్న వ్యక్తులు చాలామంది కాసేపటికి తేరుకుని మళ్లీ ఏమీ జరగనట్లు వెళ్లిపోతూ ఉంటారు. దీనినే వాడుకభాషలో వాయి అని, వ్యవహారిక భాషలో మూర్ఛ అని, వైద్యపరిభాషలో ఫిట్స్ లేదా ఎపిలెప్సీగా చెబుతారు. దెయ్యాలు, భూతాల వలన ఇలా జరుగుతుందని ఒక అపోహ కూడా వుంది. అయితే, ఇనుప తాళాలకు, ఈ వ్యాధికి ఎలాంటి సంబంధం లేదంటున్నారు న్యూరాలజిస్టులు. ఏం చేసినా చేయకపోయినా ఈ మూర్ఛ లక్షణం రెండు మూడు నిమిషాలకంటే ఎక్కువ వుండదు. అంతకంటే ఎక్కువ సమయం కొనసాగితే వైద్యపరమైన అత్యవసర పరిస్థితిగా గుర్తించాలి, తగిన చికిత్స అందించాలి. వాస్తవానికి ఇది నాడీకణ సంబంధిత సమస్య. తాజా అధ్యయనం ప్రకారం భారత్‌లో 1.3 కోట్ల మంది ఎపిలెప్సీతో బాధపడుతుండగా, కేవలం 29 లక్షల మందికి మాత్రమే ఒకింత చికిత్స అందింది. ప్రపంచ వ్యాప్తంగా 65 మిలియన్ల మంది ఈ వ్యాధితో బాధ పడుతున్నారు. ప్రతి వంద మందిలో ఒకరికి ఈ వ్యాధి వున్నట్లు ఒక అంచనా. అయితే, ఈ వ్యాధి గురించి ప్రజలలో సరైన అవగాహన లేకపోవడం, అనేక అపోహలు చెలామణీలో వుండటంతో సమయానికి మందులు కూడా అందడంలేదు. ఇది ఎవరినైనా, ఎప్పుడైనా, ఎక్కడైనా ప్రభావితం చేయవచ్చు. ఒక్క క్షణంలో జీవితాలను మార్చనూగలదు.

'పుట్టినప్పటి నుండి పరిమళాలే లేని/ పూలెన్ని లేవు?/ గగనాన మూగి వర్షించగాలేని మే/ ఘాలెన్ని లేవు?' అంటాడు ఖలీల్ జిబ్రాన్. ఎలాంటి గుర్తింపూలేని ఒక యువతి చొరవతో చిన్నగా ప్రారంభమైన 'పర్పుల్ డే' ఆలోచనకు అనూహ్య మద్దతు లభించింది. పర్పుల్ (ఊదారంగు)డే అనేది మూర్ఛ క్యాలెండర్‌లో అతిపెద్ద అంతర్జాతీయ నిధుల సేకరణ మరియు అవగాహన దినం. 'పర్పుల్ డే' ప్రపంచవ్యాప్తంగా మూర్ఛవ్యాధి గురించి అవగాహన పెంచడానికి చేసే ఒక ప్రయత్నం. ఏటా మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లోని ప్రజలు ఊదారంగు దుస్తులు ధరించి, మూర్ఛపై సాధారణ ప్రజల్లో అవగాహన పెంచడం, ఈ పరిస్థితికి నెట్టబడిన వ్యక్తులు ఎదుర్కొంటున్న సామాజిక కళంకాన్ని తొలగించడం, మానసికంగా వారిని శక్తివంతం చేయడం వంటి కార్యక్రమాలు జరుగుతుంటాయి. దీని కోసం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వేర్వేరు రోజులు వున్నప్పటికీ...మూర్ఛ వ్యాధిగ్రస్తులకు చేయూతనిచ్చి, సరైన చికిత్స తీసుకొని ఆరోగ్యవంతులు కావడానికి అవసరమైన మానసిక స్థైర్యాన్ని నింపడమే 'పర్పుల్ డే' లక్ష్యం. 'మాట చేతగా మారి/ మనిషి మనిషితో చేరి/ స్వప్నం సత్యం ఐతేనే/ స్వర్గం' అంటాడు మహాకవి శ్రీశ్రీ. ఆ లక్ష్య చేతనలో చేయూతనందించడం మన వంతు బాధ్యత.

# విశాఖ లో తొలి బేబీ థీమ్ ఫోటో స్టూడియో

## - ఘనంగా ప్రారంభించిన డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్




విశాఖపట్నం (విజయభాను న్యూస్): అంతర్జాతీయ ఈవెంట్ డైరెక్టర్ వీరుమామ ఆధ్వర్యంలో తొలి బేబీ థీమ్స్ స్టూడియో ను డిప్యూటీ మేయర్ ప్రారంభించారు. జంగిల్, బీచ్, టాయ్, బర్డ్, స్కూల్, లైబ్రరీ, ఫ్రాన్స్,సంగీతం, మబ్బులు, ఏరో, వంటి 30 థీమ్స్, ప్రాపర్టీస్ మరియు మెటర్నిటీ షూట్స్ తో ఈ స్టూడియో రూపందించడం చాలా బాగుందని శ్రీధర్ అన్నారు. వీరుమామ మాట్లాడుతూ ఇటువంటి స్టూడియో ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేట్టు గా ద్వారకా నగర్ లో పెట్టడం జరిగిందని అన్నారు. యు ట్యూబ్ స్టార్ లత, జూనియర్ ఐకాన్ మొక్షిత పాల్గొన్నారు.




# కణితి విశ్వనాథం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

## - కణితి కి ధర్మాన సోదరుల నివాళులు



పలాస/కాశీబుగ్గ (విజయభాను న్యూస్) : శ్రీకాకుళం మాజీ పార్లమెంట్ సభ్యులు స్వర్గీయ కణితి విశ్వనాథం చిరస్మరణీయులని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. పలాసలో గల కణితి విశ్వనాథం కుటుంబాన్ని బుధవారం సాయంత్రం ధర్మాన సోదరులు పరామర్శించారు. అయనతో తమ పరిచయాన్ని, సుదీర్ఘ అనుభవాన్ని నెమరువేసుకుంటూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంచి విలువలు గల రాజకీయ వేత్తగా, జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన నేతగా కణితి విశ్వనాథం జిల్లాకు చేసిన సేవలను ఈ సందర్భంగా ధర్మాన సోదరులు కొనియాడారు. కణితి విశ్వనాథం చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. వైఎస్ఆర్సిపి మహిళా విభాగం అధ్యక్షురాలు చింతాడ మంజు, కళింగ కార్పొరేషన్ చైర్పర్సన్ పేరాడ తిలక్, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, గోండు కృష్ణమూర్తి, పలువురు పార్టీ నాయకులు తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

# కవి సమయం

## ఆశల పల్లకి

ఆ, క్షణంకై - ఆ, ఒక్క క్షణంకై;
ఈ క్షణాలు - ఈ అన్వేషణ
ఈ ఆరాటం - ఈ ఆర్భాటం
నిండు నూరేళ్ల జీవితం కావాలని
ఆ కాంక్ష - ఆ కాంక్ష - ఆ కాంక్ష
ఎక్కడున్నదో! నా పిట్టా!
ఎక్కడున్నదో ! నా గుట్టా! అని
వేదికి, వేదికి, వేదికి ఎన్నుకున్నా!
వివాహా మహోత్సవం ఏర్పాట్లు చేసుకున్నా! ... ॥ఈ క్షణం॥
బందు మిత్రులను - ఆడపడ్చులను
ఆహ్వానించుకున్నా!
తోటి పెళ్లి తతంగాలు జరుపుకున్నా!
వేది పండితుతుల శోత్రాలతో,
మంగళ వాయుద్వాలతో,
అక్షింతాల - ఆశ్వీరవాదాలతో,
మూడుముళ్లు కట్టా! ... ॥ ఆ క్షణం॥
పసుపుబొత్తుల - బ్రహ్మముడులతో
అగ్నిసాక్షిగా ఉండాలని
- అగ్నిహోమము చుట్టూ;
చిలకట్టు కట్టె చిలక - చిటికిన వ్రేళ్లు పట్టుకొని
ఏడడుగులు నడ్చుకున్నా!
ముత్యాల తలంబ్రాల ముచ్చట్లు జరుపుకొన్నా!
ఆశల పల్లకి ఎక్కి ఊరేగించుకున్నా!
...॥ఆ క్షణం॥

రచయిత
యల్.సిద్ధు

# పంచాంగం

మాసం : వైశాఖం, షష్ఠి,ఉ.11.10
పునర్వసు పూర్తి (24-00) వ.సా. 5.27ల 7.12


గురువారం
27-04-2023

a **మేషం** : చేతివృత్తుల వారికి అంతంతమాత్రంగానే ఉంటుంది.ఖర్చులు మీ రాబడికి తగినట్లుగానే ఉంటాయి. కోర్టు వ్యవహారాలు, ఆస్తి తగాదాలు కొత్త మలుపు తిరుగుతాయి. రుణం ఏ కొంతైనా తీర్చాలన్న మీ యత్నం ఫలిస్తుంది. స్పెక్యులేషన్ రంగాల వారికి సామాన్యం. b **వృషభం** : రావలసిన ధనం అందటంతో తనఖా పెట్టిన వస్తువులు విడిపించుకుంటారు. ఎదుటివారు మీ మాటలను తప్పుగా అర్థం చేసుకుంటారు. గృహంలో ఒక శుభకార్యం చేయాలనే ఆలోచన స్ఫురిస్తుంది. పిల్లలు, ప్రియతములతో కలసి విందులు, వేడుకలలో పాల్గొంటారు. స్త్రీలకు గుర్తింపు, రాణింపు లభిస్తుంది. C **మిథునం** : బంధువుల రాకపోకలు సంతోషాన్ని కలిగిస్తాయి. రావలసిన మొండిబాకీలు సైతం వసూలు కాగలవు. లిటిగేషన్ వ్యవహారాలలో జాగ్రత్త వహించండి. గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. అనుకోని బకాయిలు వసూలవుతాయి. వాహనం నడిపేటప్పుడు జాగ్రత్త అవసరం. ఆరోగ్యంపట్ల జాగ్రత్త వహించండి. d **కర్కాటకం** : వృత్తి, ఉద్యోగాలందు ఉన్న వారికి ఆదాయం బాగుంటుంది. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. కోర్టు వ్యవహారాలు పరిష్కార దిశగా సాగుతాయి. మిత్రుల సహకారంతో కొన్ని సమస్యలు పరిష్కారమవుతాయి. బాకీలు వసూలవుతాయి. సంఘంలో మీకు మంచి పేరు, ఖ్యాతి లభిస్తుంది. కుటుంబానికి మనశ్శాంతి లభిస్తుంది. e **సింహం** : ఆర్థిక విషయాలలో కొన్ని ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికీ ముఖ్యుల సహకారం వలన సమసిపోతాయి. కొత్తగా చేపట్టిన వ్యాపారాల్లో లాభాలు పొందుతారు. పాత సమస్యలు మీకు అనుకూలించగలవు. టెక్నికల్, కంప్యూటర్, ఎలక్ట్రానికల్ రంగాలలోని వారికి చికాకులు తప్పవు. నూతన పరిచయాలు ఏర్పడతాయి. f **కన్య** : వృత్తి, వ్యాపార రంగాల వారికి అను కూలంగా ఉంటుంది. స్పెక్యులేషన్ రంగాల వారికి లాభం చేకూరుతుంది. ఆరోగ్యంలో చిన్న చిన్న సమస్యలు ఎదుర్కొన్నప్పటికీ నెమ్మదిగా సమసిపోతాయి. మీ కుమారుని మొండివైఖరి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది. వాహనం నడుపుతున్నప్పుడు జాగ్రత్త అవసరం. g **తుల** : వృత్తి, వ్యాపార రంగాల వారికి అనుకూలంగా ఉంటుంది. స్పెక్యులేషన్ రంగాల వారికి లాభం చేకూరుతుంది. ఆరోగ్యంలో చిన్న చిన్న సమస్యలు ఎదుర్కొన్నప్పటికీ నెమ్మదిగా సమసిపోతాయి. మీ కుమారుని మొండివైఖరి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది. వాహనం నడుపుతున్నప్పుడు జాగ్రత్త అవసరం. h **వృశ్చికం** : ఉద్యోగస్తులకు పై అధికారులవల్ల ఒత్తిడి, చికాకులు ఎక్కువవుతాయి. విద్యార్థుల ఆలోచనలు పక్క దారి పట్టేందుకు ఆస్కారం ఉంది. అనవసరపు వివాదాల్లో తలదూర్చి సమస్యలు తెచ్చుకోకండి. స్థిరాస్తికి సంబంధించిన చర్చలు సత్ఫలితాలను ఇవ్వగలవు. ప్రైవేటు సంస్థల్లోని వారికి శ్రమకు తగిన ప్రతిఫలం కానవస్తుంది. i **ధనుస్సు** : దంప తుల మధ్య చిన్న చిన్న అభిప్రాయబేధాలు తలెత్తుతాయి. అర్ధాంతరంగా ఆపివేసిన పనులను పూర్తి చేస్తారు. ఆత్మీయుల నుంచి శుభాకాంక్షలు అందుకుంటారు. పీచు, నార, ఫోమ్, లెదర్ వ్యాపారస్తులకు మందకొడిగా ఉండును. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటి పైనే శ్రద్ధ వహించండి. మీ ఆంతరంగిక విషయాలను గోప్యంగా ఉంచటం మంచిది. j **మకరం** : ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. ఉమ్మడి వ్యాపారులకు ధన నష్టం కలిగే అవకాశం ఉంది. స్థిర చరాస్తుల విషయంలో జాగ్రత్త అవసరం. దంపతుల మధ్య అవగాహనా లోపం. రాజకీయ నాయకులు వాగ్దానాలు చేసి సమస్యలు తెచ్చుకోకండి. లాటరీ వ్యాపారస్తులకు సంతృప్తి కానవస్తుంది. k **కుంభం** : స్త్రీలకు కాళ్లు, తల, నరాలకు సంబంధించిన చికాకులు అధికంఅవుతాయి. చిట్స్, ఫైనాన్స్, బ్యాంకింగ్ రంగాల వారికి ఒత్తిడి పెరుగుతుంది. నిరుద్యోగులు భేషజాలకు పోకుండా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవటం మంచిది. హామీలు, మధ్యవర్తిత్వాలకు దూరంగా ఉండటం మంచిది. L **మీనం** : సహోద్యోగులు, సన్నిహితులతో సమావేశం నిరాశాజనకంగా ముగుస్తుంది. స్త్రీలకు ఆరోగ్యంలో మెలకువ అవసరం. ఇప్పటిదాకా విరోధులుగా ఉన్న వ్యక్తులను సుముఖం చేసుకోగలుగుతారు. ఎంతో శ్రమించిన మీదట గాని అనుకున్న పనులు పూర్తి కావు.

# శ్రీరామచంద్రుడు.. సాక్షాత్తు దేవుడే!

## సంకీర్తన

రాముడు చెడ్డవాడంటూ ఇటీవల కాలంలో కొందరు కొన్ని వితండవాదాలు లేవదీస్తున్నారు. రాముడే కాదు లక్ష్మణుడూ అలాంటివాడేనని కూడా దబాయిస్తున్నారు. రాముడు మంచివాడైతే సీతాదేవిని అడవులెకందుకు పంపించాడని ప్రశ్నకూడా వేస్తున్నారు. వాటన్నిటికీ సమాధానమే ఈ ప్రయత్నం. వాల్మీకిని రామాయణం రాయమని ప్రోత్సహించడానికి వస్తాడు నారదుడు. పంపా తీరంలోని వనంలో హనుమంతుడినిచూసి, ఆయన మాటపై గౌరవంవుంచి, సుగ్రీవుడితో స్నేహంచేసాడు రాముడు. తనకథ, సీతవృత్తాంతం మొత్తం ఆయనకు చెప్పాడు. చెప్పిన తర్వాత, సుగ్రీవుడు రాముడితో అగ్ని సాక్షిగా స్నేహితులయ్యారు. రాముడు వానరుడితో స్నేహం చేశాడంటే అది అతడి సౌశీల్యాతిశయం గురించి చెప్పడమే. గుహుడు హీనజాతివాడైనా, పురుషుడైనందున అతనితో స్నేహం చేసినందువల్ల రాముడి సౌశీల్యం చెప్పడం జరిగింది. హీన స్త్రీ అయిన శబరితో స్నేహం చేయడంవల్ల రాముడు మిక్కిలి సౌశీల్యవంతుడయ్యాడు. వానరుడైన సుగ్రీవుడితో స్నేహమంటే మీదుమిక్కిలి సౌశీల్యం చూపడం జరిగింది. శ్రీరామచంద్రుడు ప్రశస్తమైన ధర్మజ్ఞానం గలవాడు. చేసిన ప్రతిజ్ఞ తప్పనివాడు. దానధర్మాలు, స్వాశ్రీతరక్షణ వల్ల లభించినయశస్సు, శత్రువులను అణచినందున వచ్చిన కీర్తి గలవాడు. సర్వజ్ఞుడు. బ్రహ్మజ్ఞాన సంపన్నుడు. ఆత్మతత్వం ఎరిగినవాడు. విష్ణువుతో సమానుడు. లోకాలను పాలించ సమర్థుడు. ప్రాణికోటిని రక్షించాలన్న కోరికున్నవాడు. ధర్మాన్ని తానాచరిస్తూ, ఇతరులతో ఆచరింపచేసేవాడు. అలా వచ్చిన నారదుడిని, గుణవంతుడు, అతివీర్యవంతుడు, ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు, సత్యశీలుడు, సమర్థుడు, నిశ్చలసంకల్పుడు, సదాచార సంపన్నుడు, సమస్త ప్రాణులకు మేలు చేయాలన్న కోరి కున్నవాడు, విద్వాంసుడు, ప్రియదర్శ నుడు, ఆత్మ వంతుడు, కోపాన్ని స్వాధీనంలో వుంచుకున్నవాడు, ఆశ్చర్యకరమైన కాంతిగల వాడు, అసూయ లేనివాడు, రణరంగంలో దేవదానవులను గడ-గడలాడించ గలవాడు ఎవరైనా వున్నారా ఈ భూలోకంలో? అని పదహారు ప్రశ్నలు వేస్తాడు వాల్మీకి. నారదుడు ఆ ప్రశ్నలకు సమాధానం చెప్తాడు. బాల్యంలోనే శ్రీరాముడు గుహుడు లాంటి (నీచ) జాతి వారితో సహవాసం చేయడంతో, ఆయన గుణ వంతుడు అయ్యాడు. తాటకాది రాక్షసులను చంపి వీర్యవంతుడు అయ్యాడు. గురువాజ్ఞ మీరక పోవడం-జనకాజ్ఞ జవదాటక పోవడం-పరశు రాముడిని చంపక పోవడం లాంటివి ఆయన ధర్మజ్ఞుడు అని తెలుపుతాయి. అయోధ్య కాండ వృత్తాంతమంతా శ్రీరాముడిని సత్యవాది గా-దృఢవ్రతుడిగా -సచ్చరిత్రుడుగా తెలుపుతుంది. విభీషణ శర ణాగతి ద్వారా రాముడి ఆత్మవంతుడి లక్షణాన్ని బయటపెడుతుంది. ఇంద్రజిత్తుపై కోపించక పోవడం, చేజిక్కిన రావణుడిని విడిచిపెట్టడం, రాముడి జితక్రోధత్వాన్ని తెలుపుతుంది. విరోధైన రావణుడిని మెచ్చు కోవడమంటే రాముడికి అసూయలేదనే కదా. ఇలానే రాముడు కాంతియుక్తుడనీ- భయం కరుడనీ పలు సందర్భాల్లో అర్థమవుతుంది. వాల్మీకి శ్లాఘించిన గుణాలు అసమానమైనవి. ఒక్కో గుణంలో అంతర్లీనంగా ఇంకొన్ని వుండడంతో అవి అనేకమయ్యాయి. మనుష్యమాత్రులందు ఇవి కనపడవు. ఇట్టి సుగుణ సంపత్తికలవాడు, ఇక్ష్వాకుల మహారాజు వంశంలో, రామా రామా రామా, అని లోకులు పొగిడే రామచంద్రమూర్తి అనే పేరుగలాయన మాత్రమే. అతివీర్యవంతుడాయన. అసమాన మైన-వివిధమైన-విచిత్రమైన శక్తిగలవాడు. సర్వం తెలిసినవాడు. నీతే ప్రధానం ఆయనకు. పరులకు హితమైన, ప్రియమైన మాటలు చెప్తాడు. శ్రీమంతుడు. ఎవరిపై శత్రు భావం లేకపోయినా, తనను ఆశ్రయించిన వారిని ద్వేషిస్తే, వారిని నాశనం చేసే వాడు. ఎత్తైన మూపురాలున్నవాడు.



# రాష్ట్రంలో బీజేపీకి మద్దతు పలికే పార్టీలన్నీ కమ్యూనిస్టులకు శత్రువులే

**-దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ల సంస్థలకు అమ్మకాలు**

**-రాష్ట్రాన్ని అప్పుల మయం చేసిన జగన్ననీ నమ్మవద్దు -సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య**



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రాజాం (విజయభాను న్యూస్) : రాష్ట్రంలో బీజేపీకి మద్దతు పలికే పార్టీలన్నీ కమ్యూనిస్టులకు శుత్రువులేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య , సీపీఎం జిల్లా కార్యదర్శి టి.సూర్యనారాయణలు అన్నారు. బుధవారం రాజాం నియోజకవర్గం లో సిపిఐ, సిపిఎం పార్టీల ఆధ్వర్యంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శంకర్ రావు అద్యక్షతన ప్రచార భేరి సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ తొమ్మిదేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి శూన్యమని, ప్రజల ఆస్తులైన ప్రభుత్వ రంగ సంస్థలు రైల్వే, రక్షణ, ఎల్ఐసి, బ్యాంకులు, ఓడరేవులు, వ్యవసాయం కార్పొరేట్ వ్యక్తులైన ఆదాని అంబానీలకు గంపగుతేగా అమ్మేస్తున్నారని.. గో రక్షణ పేరుతో నిత్యం దళిత, గిరిజనలపై దాడులు జరుగుతున్నాయని అన్నారు. బిజెపి అధికారంలోకి వస్తే ప్రధానమంత్రి మోదీ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి నిరుద్యోగులను మోసం చేశారని ఎద్దేవా చేశారు. విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని వెలుక తీసి పేదల అకౌంట్లో రూ.15 లక్షలు వేస్తానని హామీ ఇచ్చారని ఏమైందని ప్రశ్నించారు. దేశ సంపదను ఆదాని అంబానీ లాంటి దొంగల చేతిలో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ హటావో ..దేశంకు బచావో నినాదంతో ప్రజలందరూ మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. మోదీ తొమ్మిదేళ్ల పాలనలో కోట్లకు పడగలెత్తిన కుబేరులకు తప్ప సామాన్య ప్రజలకు ఏమాత్రం ఉపయోగకరంగా లేదని రైతులు, కార్మికులు, యువకులతో పాటు అన్ని వర్గాల ప్రజలు మోదీ పాలనపై విసికెత్తిపోయారన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న జగన్మోహన్ రెడ్డి బిజెపి ప్రభుత్వానికి మద్దతు పలికి ప్రజలపై పన్ను భారాలు వేయటమే పనిగా పెట్టుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో విభజన చట్టాలు, ప్రత్యేక హెూదా, పోలవరం నిధులు, వెలిగొండ ప్రాజెక్టు పూర్తి వంటి సమస్యలపై బిజెపిని నిలదీసే సత్తా లేదన్నారు. రాష్ట్రంలో ప్రజలకు విద్యుత్ చార్జీలు, చెత్త చార్జీలు, ఆస్తి పన్ను, బస్సు చార్జీలు ఏడుసార్లు పెంచిన జగన్మోహన్ రెడ్డి.. నిన్నెందుకు రాష్ట్ర ప్రజలు నమ్మాలని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని అప్పులమయం చేసి సంక్షేమం లేకుండా రాష్ట్రాన్ని 40 ఏళ్ల అభివృద్ధి వెనక్కి వెళ్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బిజెపికి మద్దతు పలికే పార్టీలన్నీ కమ్యూనిస్టులకు శత్రువులే అని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను కమ్యూనిస్టులు నిరంతరం వ్యతిరేకిస్తారన్నారు.రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు, , ఏ రాజకీయ పార్టీ నాయకుడైన రాష్ట్రంలో పర్యటనకు రావచ్చునని అది రాజ్యాంగం కల్పించిన హక్కుని అన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో దళితులపై హత్యలు దారుణాలు మారణహెూమాలు జరిగితే మాట్లాడని మంత్రి ఆదిమూలపు సురేష్ చంద్రబాబు పర్యటనలో చొక్కా విప్పి రోడ్డుపై బైఠాయించడం ఏమిటని ప్రశ్నించారు.

రాష్ట్రంలో దళితులైన అచ్చన్న ,సుధాకర్ ,జడ్జి రామకృష్ణలను దారుణంగా హింసించి హత్య చేస్తే మాట్లాడని ఆదిమూలపు సురేష్ ఇప్పుడు ఎందుకు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. సురేష్ మంత్రి పదవిని కాపాడుకునేందుకే ఇలాంటి డ్రామాలకు తెరలేపారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పాలనలో పూర్తిగా వైఫల్యం చెందాయని ప్రజలు వచ్చే ఎన్నికల్లో మోడీ జగన్ కు తగిన బుద్ధి చెబుతారన్నారు..ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమం లో , సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి. కృష్ణ, ఎన్.నాగభూషణం, సీపీఎం జిల్లా కమిటీ నాయకులు కె. సురేష్,విశ్వనాథం, త్రినాథ్, సీపీఐ నియోజక వర్గ సహాయ కార్యదర్శులు ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్, కనక రాజు సీపీఐ సీపీఎం నాయకులు క్రిష్ణ, గంగారం, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

# మార్గదర్శి చిట్ ఫండ్ పై ఎందుకంత కక్ష సాధింపు

**టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు**



**భీమునిపట్నం, విజయభాను న్యూస్ :** ప్రభుత్వ నియమ నిబంధనలకు కట్టుబడి ఫైనాన్స్ కార్పొ రేషన్లో విశిష్ట సేవలం దిస్తున్న మార్గదర్శి చిట్ ఫండ్ పై ఎందుకంత కక్ష సాధింపని పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిం చారు దేశంలో ఏ చిట్ ఫండ్ సంస్థకు లేనటువంటి ఖాతాదారులు మార్గదర్శికి ఉన్నారని అన్నారు. నీతి, నిజాయితీ, నిబద్ధత విలువలతో కూడిన ఈ సంస్థను 40 ఏళ్ల క్రితం రామోజీరావు స్థాపించారని అన్నారు. సంస్థ ఏర్పాటు అయిన దగ్గర నుండి నేటివరకు వందల కోట్ల రూపాయలు ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తున్నారని అన్నారు. మార్గదర్శి ద్వారా కొన్ని వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ది చేకూరుతుందని అన్నారు. అలాంటి సంస్థపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష కట్టి దర్యాప్తు పేరిటా యాజమాన్యాన్ని వేధించడం మానుకోవాలని గంటా నూకరాజు హితవు పలికారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న మార్గదర్శి చిట్ ఫండ్ ను పట్టుకొని ఎందుకు వేధిస్తు న్నారని అడిగారు. మార్గదర్శి ద్వారా న్యాయం జరుగుతుందని, కుటుంబానికి పెద్ద దిక్కుగా అండగా ఉంటుందని లబ్ధిదారులు చెబుతున్నారని, అలాంటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు అంతలా స్పందిస్తుందని గంటా నూకరాజు ప్రశ్నించారు.

# జగనన్న వసతి దీవెన ద్వారా పేద విద్యార్థులకు ఉన్నత చదువులు చదివే ఖ్యాతి జగన్‌దే

**నాగవంశం కార్పొరేషన్ ఛైర్ పర్సన్ బొడ్డు అప్పలకొండమ్మ**




**విశాఖపట్నం, విజయభాను న్యూస్ :** ఉన్నత చదువులు చదివే పేద విద్యార్థుల భోజన, వసతి ఖర్చులకు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ సాయం జగనన్న వసతి దీవెన ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 9,55,662 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో 912.71 కోట్లు జమ చేసి అండగా నిలిచిన ఖ్యాతి జగన్ దే నని దక్కుతుందని ఆంధ్రప్రదేశ్ నాగవంశం కార్పొరేషన్ చైర్ పర్సన్ బొడ్డు అప్పలకొండమ్మ, రెల్లి కార్పొరేషన్ చైర్మన్ మధుసూధనరావు,యత కార్పొరేషన్ చైర్ పర్సన్ పిల్లి సుజాత,నగరాల కార్పొరేషన్ చైర్ పర్సన్ పిల్లా సుజాత, రాష్ట్ర వైసీపీ సంయుక్త కార్యదర్శి బొడ్డు అప్పల నాయుడు లు వ్యాఖ్యానించారు. బుధవారం(26 -04 - 2023) ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనంతపూర్ జిల్లా నార్పలలో బటన్ నొక్కి నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమచేస్తున్న సందర్భంగా విశాఖ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి హాజరై కలెక్టర్ డాక్టర్ ఏ మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ ఇతర అధికారులతో కలిసి లబ్ధిదారులకు చెక్కు అందచేశారు.ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన కింద ఇప్పటివరకు 14,223.60 కోట్ల సాయం అందించారని,46 నెలల కాలంలో కేవలం విద్యారంగ సంస్కరణలపై జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం 58,555.07 కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. విద్యార్థుల ఉన్నత చదువులు లక్ష్యంగా జగనన్న వసతి దీవెన పథకాన్ని ప్రారంభించారని ఈ పథకం ద్వారా దేశంలో ఎక్కడా లేని విధంగా ఏటా రెండు వాయిదా లలో ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ అభ్యసించే వారికి ఇరవై వేల రూపాయల వరకు వసతి, భోజన, రవాణా ఖర్చుల కోసం వారి తల్లుల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తున్నారని కొనియాడారు.విశాఖజిల్లాకు చెందిన 43938 లబ్దిదారులకు నలభై ఒక్క కోట్ల పదిహేడులక్షల నలభై ఐదు వేల రూపాయలు నేరుగా ఎకౌంట్లలో జమ చేసారని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు,కార్పొరేషన్ ల చైర్మన్ లు,డైరెక్టర్ లు పాల్గొన్నారు.

# 35వ వార్డ్ ప్రసాద్ గార్డెన్స్ లో 122 మందికి జగనన్న శాశ్వత ఇంటి పట్టాల పంపిణీ చేసిన విశాఖ దక్షిణ నియోజకవర్గం శాసన సభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్



విశాఖపట్నం, విజయభాను న్యూస్ : విశాఖ దక్షిణ నియోజకవర్గం 35వార్డు ప్రసాద్ గార్డెన్స్ లోని శ్రీ శ్రీ శ్రీ దుర్గామాంబ యువజన సంఘం లో 175 కుటుంబాల ఆరు దశాబ్దాల కల ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ చొరవతో ఎట్టకేలకు నెరవేరింది. ప్రసాద్ గార్డెన్స్ ప్రాంతంలో 60 సంవత్సరాలుగా 175 కుటుంబాలు జీవిస్తున్నాయి. అయితే వారు నివసిస్తున్న నివాస గృహాలు సంబంధించి ఎటువంటి పట్టా లేకపోవడంతో నాటి నుంచి అధికారులకు ప్రజాప్రతినిధులకు అర్జీలు పెడుతూనే ఉన్నారు. అయితే ప్రభుత్వాలు ప్రజా ప్రతినిధులు మారిన వారి కల నెరవేరలేదు. అయితే ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ చొరవతో 60 ఏళ్ల నాటి నుంచి వస్తున్న వారి కల బుధవారం కళ్ళ ముందు సాక్షాత్కరించింది. వారిలో 122 మందికి పట్టాలను నేడు బుధవారం విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అందజేశారు. మిగిలిన 53 గృహాలకు సంబంధించి కొందరు మృతి చెందడం వంటి కారణాలు చే వారి వారసుల పేరున త్వరలో పట్టాలు అందజేయనున్నారు. బుధవారం పంపిణీ కార్యక్రమంలో ముందుగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ 122 మంది లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ ప్రసాద్ గార్డెన్ వాసుల 60 ఏళ్ల నాటి కల జగనన్న ప్రభుత్వంలో నెరవేరిందన్నారు. లబ్ధిదారులకు పట్టా తో పాటు కన్వెన్స్ డీడ్ అందజేయడం జరుగుతుందన్నారు. 122 మంది లబ్ధిదారులకు తొలి విడుదల ఈ పట్టాలు అందజేస్తున్నాడు చెప్పారు. అయితే 175 మందిలో కొంతమంది చనిపోవడం వంటి కారణాలు నేపథ్యంలో వారి వారసులు పేరున పట్టా ఇచ్చే కార్యక్రమం జరుగుతుందన్నారు. మిగిలిన 53 మంది కి కూడా త్వరలోనే పట్టాలు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. అలాగే రెండేళ్లలో14.75 కోట్ల రూపాయలతో 35 వార్డు లో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. 9 కోట్లతో యూజిడి పనులు, 2.75 కోట్లతో 35 వార్డులోని మూడు స్కూలు ను డిజిటల్ మోడలైజేషన్ స్కూల్స్ గా తీర్చిదిద్దడం జరిగింద న్నారు. మరో మూడు కోట్లతో వివిధ అభివృద్ధి పనులు వార్డులో జరిగాయన్నారు. తాగా 60 ఏళ్లుగా తమ ఎదురు చేస్తున్న పట్టాలు అందించినందుకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ తోపాటు వార్డ్ కార్పొరేటర్ భాస్కర్ రావుకు జీవీఎంసీ అధికారులకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే తో పాటు జోనల్ కమీషనర్ శివప్రసాద్, 35వార్డ్ కార్పొరేటర్ విల్లూరి భాస్కర రావు, శ్రీ దుర్గామాంబ యువజన సంఘం సభ్యులు గౌరీ శంకర్, దుర్గాలమ్మ గుడి చైర్మన్ నాయన మల్లిబాబు, గణపతి, కండిపిల్లి వరలక్ష్మి, గాజుల ప్రసాద్, పైడిరాజు, దుర్గాప్రసాద్, గుజ్జి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# చెరువుల ఆక్రమణలపై చర్యలు తీసుకోండి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రమేష్ కుమార్.

రాజాం (విజయభాను న్యూస్) : చెరువుల్లో గుర్తించిన ఆక్రమణలను తొలగించటంలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారుల తీరు సరైనది కాదని, తక్షణమే అటువంటి వాటిపై చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు శాసపు రమేష్ కుమార్ డిమాండ్ చేసారు. బుధవారం స్థానిక విలేకరుల తో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర వ్యాప్తంగా అనేకచోట్ల రైతులు స్పందనలో చెరువుల ఆక్రమణపై ఫిర్యాదులుచేస్తుంటే వాటికి రెవెన్యూ సిబ్బంది విచారణ జరిపి ఆక్రమణకు గురైనట్లు ఫిర్యాదుదారులకు ఎండార్స్మెంట్స్ ఇస్తూ త్వరలోనే ఆక్రమణలను తొలగించడం జరుగుతుందని తెలియజేసు కుంటూ ఇంతవరకు ఎక్కడకూడా ఆక్రమణ లను తొలగించకపోవడం ఉత్తరాంధ్రలోని రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువులోని ఆక్రమణలను గుర్తించిన తర్వాతకూడా ఆక్రమణలను తొలగించక పోవడానికి ప్రధానకారణం అధికారుల అవినీతి మరియు నాయకుల ఒత్తిడే కారణమని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చెరువులోని ఆక్రమణలను గుర్తించిన తర్వాతకూడా తొలగించడంలో అలసత్వం వహిస్తున్నవారిని కఠినంగా శిక్షించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. శ్రీకాకుళంజిల్లా పొందూరు మండలం లైదాం గ్రామంలోని సర్వేనెంబర్ 28 లో కొత్తచెరువు, పార్వతీపురం మన్యం జిల్లాలో గరుగుబిల్లి మండలం నాగూరు రెవిన్యూ గ్రామంలో సర్వే నంబర్ 57 - 2%గా% లో వేపకర్రబంద చెరువు, అదేవిధంగా బలిజిపేట మండలం పలగర రెవిన్యూ గ్రామంలోని నేరేడుగర్ర చెరువు...

ఇలా ఉత్తరాంధ్రవ్యాప్తంగా ఆక్రమణలు ఉన్నప్పటికీ ఎక్కడాకూడా ఆక్రమణలను తొలగించకపోవడం సుప్రీంకోర్టు గైడ్లైన్సును, హైకోర్టు తీర్పులను దిక్కరించడమే అవుతుందని, అధికారుల తీరును ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణసమితి తీవ్రంగా ఖండిస్తుందని వెల్లడించారు.

ఇప్పటికైనా ప్రస్తుత నీటి అవసరాలు, భవిష్యత్ తరాల మనుగడ,పశుపక్షాదను, పర్యావరణాన్ని, భూగర్భజలాలను కాపాడు కోవడానికి తక్షణం ఉత్తరాంధ్రవ్యాప్తంగా ఉన్న చెరువుల ఆక్రమణలను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన ఆక్రమణలను తొలగించ వలసిందిగా ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి తరుపున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

# వైయస్సార్సీపి ప్రభంజనాన్ని ఏ శక్తి అడ్డుకోలేదు

**పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి...**



అల్లూరిజిల్లా. విజయభాను. న్యూస్.పాడేరు.. వైఎస్ఆర్సిపి ప్రభంజనాన్ని ఏ శక్తి అడ్డలేదని పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. చింతపల్లి మండలం గొందిపాకల గ్రామ సచివాలయం పరిధిలో గాదుగొయ్యి, బద్దిమెట్ట, చిక్కుడు బట్టి గ్రామాల్లో బుధవారం జగనన్నే మా భవిష్యత్తు- మా నమ్మకం నువ్వే జగన్, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై 264 గడపలను సందర్శించారు. గడపగడపకూ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గృహ యజమానుల అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. ప్రభుత్వ పాలనపైనా గ్రామ వాలంటీర్ వ్యవస్థ పైనా సర్వే నిర్వహించారు. ప్రజా సమస్యలను అడిగి అక్కడిక్కడే పరిష్కరించేందుకు ప్రయత్నించారు. ఆర్థిక విషయాలతో ముడిపడి వాటి పరిష్కారానికి ఉన్నతాధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా కొన్ని చోట్ల తమ గ్రామాలకు రహదార్లు సదుపాయం ఏర్పాటు చేయాలని కోరారు. ఉన్నతాధికారులతో చర్చించి ఆ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ప్రతి గ్రామానికి రహదారి సదుపాయం ఏర్పాటు దిశ చర్యలు చేపడుతున్నామని అన్నారు. జగన్మోహన్ రెడ్డి గారికి పేద, మధ్య తరగతి ప్రజల ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని అవే ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలుస్తున్నాయని భాగ్య లక్ష్మి పేర్కొన్నారు. ప్రభుత్వానికి అండగా నిలిచే పేద, మధ్యతరగతి, బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం ఏమైనా చేయడానికి వైయస్ జగన్మోహన్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని అన్నారు.

ఈరోజు వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం పేదలకు అండగా నిలవాలని, వారి పురోభివృద్ధికి, ఆర్థిక వెసులుబాటుకు ఉపయోగ ˘పడాలనే ఉద్దేశంతోనే కష్టమైనా జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని అన్నారు.

ఎంత కష్టమొచ్చిన ఈ జగనన్నకు అండగా నిలబడ్డ వారి కోసం వెనకడుగువేయబోరని స్పష్టం చేశారు. ప్రజలంతా జగనన్నకు అండగా నిలిచారన్న ధైర్యంతోనూ, మనోబలంతోనూ ముందుకు నడుసున్నారని వారి అండ ఉన్నంత కాలం వైయస్సార్‌సీపీ ప్రభంజనానికి డోకా ఉండబోదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి జెడ్పిటిసి పోతురాజు బాలయ్య పడాల్, ఎంపీపీ కోరాపు అనూష దేవి, వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షుడు మొర రవి, అరకు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పాంగి గుణ బాబు, మండల కన్వీనర్ కొరసా తిరుపతి, లిఎంపీటీసీలులి గొందుపాకల ఎంపిటిసి తాంబేలి మోహనరావు, పెదబరడ ఎంపీటీసీ పొట్టిక లోవరాజు, కొమ్మంగి ఎంపీటీసీ జర్తా రుత్తు, సర్పంచ్ సమిడి గోపాల్, వైఎస్ఆర్సిపి నాయకులు బెన్నస్వామి, బెన్నబాబు, వి.రాజారావు, శెర్రికి పొట్టయ్య, జనకని రామారావు, జనకని రాంబాబు, మాతే రాజు, జనకుని చిన్న బాలయ్య, గెమ్మిలి గంగరాజు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలకు అతీతంగా ప్రజా సేవ చేసిన వ్యక్తి రవికుమార్



ద్వారకానగర్ (విజయభాను న్యూస్): మాజీ కార్పొరేటర్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు వానపల్లి రవికుమార్ రెండవ వర్ధంతి సందర్భంగా బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర మరియు పార్లమెంట్ పద్మశాలి సాధికారిక కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ రావు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, పార్లమెంట్ ఇంచార్జ్ ఎం శ్రీ భరత్, జిల్లా ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్ పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవికుమార్ పార్టీలకు అతీతంగా అనేక సేవా కార్యక్రమాలు చేశారని అని కొనియాడారు. తెలుగుదేశం పార్టీ నాయకుడిగా కార్పొరేటర్ గా పార్టీ బలోపేతానికి ఆయన కోసం కృషి మరువలేనిదని అన్నారు కార్యక్రమంలో వానపల్లి సత్య పప్పు శ్రీనివాసరావు నామాల పెంటయ్య బండి నీలకంఠం గిడుతూరి శ్రీను పెంటపల్లి శ్రీను ఇమంది సోమేశు జొగా సన్యాసిరావు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ముస్లింల వ్యతిరేకి చంద్రబాబును బహిష్కరించాలి

- మోదీతో పొత్తు కోసం బాబు పాకులాట
- రిజర్వేషన్లు ఎత్తేస్తామన్న బీజేపీ ఎజెండాను వ్యతిరేకించాలి
- ముస్లిం సమాజానికి బాబు బహిరంగ క్షమాపణ చెప్పాలి
- ఏపీ స్టేట్ సయ్యాదత్ సాదాత్ కౌన్సిల్ చైర్మన్ కేఎస్ఎస్ నూర్ బాబా



అమరావతి (విజయభాను న్యూస్): దేశంలో సోదరభావంతో మెలుగుతున్న హిందూ, ముస్లిం, క్రైస్తవ, సిక్కులు తదితర మతాల మధ్య చిచ్చు పెడుతున్న బీజేపీతో పొత్తు కోసం టీడీపీ అధినేత పాకులాడుతున్నారని ఏపీ స్టేట్ సయ్యాదత్ సాదాత్ కౌన్సిల్ చైర్మన్ కేఎస్ఎస్ నూర్ బాబా అన్నారు. తాజాగా జాతీయ మీడియాతో మాట్లాడిన బాబు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. బుధవారం ఈ మేరకు విడుదల చేసిన ఒక ప్రకటనలో మోదీని ప్రసన్నం చేసుకునేందుకు బాబు ప్రయత్నిస్తున్నట్లు ఆ ఇంటర్వ్యూలో అర్థమవుతోందన్నారు. కర్ణాటక, తెలంగాణల్లో బీజేపీ పెద్దలు ముస్లింలకు అమలవుతున్న 4 శాతం రిజర్వేషన్లను తొలగిస్తామంటూ మాట్లాడారని గుర్తు చేశారు. ఇప్పుడు బీజేపీకి అనుకూలంగా మాట్లాడుతున్న చంద్రబాబు ముస్లిం రిజర్వేషన్లకు అనుకూలమా లేక వ్యతిరేకమా అనేది స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ముస్లిం సమాజం వేసిన ఓట్లతో గతంలో అధికారంలోకి వచ్చిన బాబు ఇప్పుడు వారికే వెన్నుపోటు పొడుస్తామంటూ చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. జాతీయ మీడియాలో మోదీని ప్రశంసిస్తూ బాబు చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, ముస్లిం రిజర్వేషన్ల అంశంపై స్పష్టమైన ప్రకటన చేయాలని సాదాత్ డిమాండ్ చేశారు. అలాగే ముస్లింల మనోభావాలను కించపరిచేలా బీజేపీ కోసం వెంపర్లాడుతున్న బాబు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. లేకుంటే రాష్ట్రంలో చంద్రబాబు చేస్తున్న పర్యటనలను ఎక్కడికక్కడ ముస్లిం సమాజం అడ్డుకుంటుందని హెచ్చరించారు. బీజేపీతో పొత్తు పేరుతో, ఆ పార్టీ అజెండాను అమలు చేయాలని చూస్తే బాబును తరిమి కొట్టడం ఖాయమని నూర్ బాబా స్పష్టం చేశారు.

# అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా విశాఖ డైరీ ఆర్థిక సహాయం

- పాడి రైతు కష్టకాలంలోనూ చేయూత - కోలార్ ఆవులు కొనుగోలుకు వడ్డీ లేని రుణాలు

- విశాఖ డైరీ డైరెక్టర్ దాడి పవన్ కుమార్



అగ్ని ప్రమాద బాధిత పాడి రైతు కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న విశాఖ డైరీ డైరెక్టర్ దాడి పవన్ కుమార్

**విశాఖపట్నం, విజయభాను న్యూస్ :** మండలంలోని చోడవరం యూనిట్ బీసీసీ పరిధిలో గల రాయపు రాజుపేట, గజపతినగరం గ్రామాలలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో పశువుల పాకలు దగ్ధమైన బాధిత పాడి రైతు కుటుంబ సభ్యులకు విశాఖ డైరీ ఆర్థిక చేయూతను అందించింది. ఈ మేరకు విశాఖ డైరీ డైరెక్టర్ దాడి పవన్ కుమార్ బాధిత పాడి రైతులు బి.శివ, బి. అప్పారావు, ఎస్ రాజు, సిహెచ్ రామకోటి లకు ఒక్కొక్కరికి 5000 చొప్పున 20 వేల రూపాయల చెక్కులను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా డైరీ డైరెక్టర్ పవన్ కుమార్ మాట్లాడుతూ ప్రతి పాడి రైతు మేలు జాతి పశువులు అభివృద్ధి చేసుకొని అధిక పాల దిగుబడి సాధించి ఆర్థికంగా లబ్ధి పొందేందుకు విశాఖ డైరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ కృషి చేస్తున్నారని ప్రశంసించారు. అగ్ని ప్రమాద బాధితులను కష్టకాలంలో ఆదుకునేందుకు ఆర్థిక సహకారం అందించిన చైర్మన్ ఆనంద్ కుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే అధిక పాల దిగుబడినిచ్చే కోలార్ ఆవులు కొనుగోలుకు విశాఖ డైరీ వడ్డీ లేని రుణాలు ఇవ్వడం జరుగుతుందని, ఆసక్తి గల పాడి రైతులు సద్వినియోగపరచుకోవాలని కోరారు. పాడి రైతుకు ఆదుకునేందుకు విశాఖ డైరీ అనేక కార్యక్రమాలు చేపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాల సంఘాల అధ్యక్ష కార్యదర్శులతో పాటు, చోడవరం యూనిట్ డైరీ సూపర్వైజర్లు, సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా రంగసాయి నాటక గ్రంథాలయం వార్షికోత్సవ వేడుకలు

# నాటక రచయితలకు సత్కారాలు



విశాఖపట్నం : విజయభాను న్యూస్ : రంగ సాయి నాటక గ్రంథాలయం 11వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. టీఎస్సార్ కాంప్లెక్స్ లోని రంగ సాయి నాటక గ్రంథాలయంలో బుధవారం జరిగిన ఈ వేడుకల్లో నాటక రచయితలు, నటులు, దర్శకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రంగ సాయి నాటక సంఘం వ్యవస్థాపకులు బాదంగీర్ సాయి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకులు వివి రమణమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రముఖ రంగస్థల నటులు, రచయిత డాక్టర్ మీగడ రామలింగస్వామి ఆత్మీయ అతిథిగా హాజరుకాగా నటులు డాక్టర్ రాజా కృష్ణమూర్తి, నటులు బొట్టా వేణు, నటులు బి మాల్యాద్రి, మేడ మస్తాన్ రెడ్డి అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. నాటక గ్రంథాలయం 11వ వార్షికోత్సవ సందర్భంగా ప్రముఖ నాటక రచయితలు కొరిటాల ప్రభాకరరావు, పిటి మాధవ్, దండు నాగేశ్వరరావు, విశ్వనాథ గణపతి రావు, రావి నాగేశ్వరరావును ఘనంగా సత్కరించారు ప్రముఖ నట దర్శకులు పి.శివప్రసాద్ పర్యవేక్షణలోని కన్యాశుల్కం నాటకం నుండి సాయంకాలమైంది సీన్ ని బాల నటులు సుమంత్, నవనీత్ ప్రదర్శించారు. అనంతరం నవచైతన్య కళానాట్య సంక్షేమ సంఘం వారిచే ఆలూ లేదు చూలు లేదు కొడుకు పేరు సోమలింగం హాస్య ప్రహసనాన్ని చిన్నారెడ్డి, పి.పోతురాజు, సి.హెచ్. పద్మ ప్రదర్శించారు. సీనియర్ జర్నలిస్ట్ ఎన్ నాగేశ్వరరావు వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో సీనియర్ నటి డి. హేమ, వర్రె నాంచారయ్య, గ్రంథ పాలకులు జమ్మా చిన్నబాబు, ఎన్. బంగార్రాజు, రామకృష్ణ తదితరులు సహాయ సహకారాలు అందించారు.



వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నాయకులు, బీసీ కమీషన్ సభ్యుడు పక్కి దివాకర్ గుండెపోటుతో మరణించిన విషయం తెలిసి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన విశాఖ జిల్లా పరిశీలకులు, టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి. దివాకర్ సతీమణిని ఫోన్‌లో పరామర్శించి, ఒడిశా రాష్ట్రం పూరీ నుంచి ఆయన మృతదేహాన్ని విశాఖ రప్పించేందుకు అక్కడి అధికారులతో మాట్లాడి ఏర్పాట్లు చేసిన వైవీ సుబ్బారెడ్డి.

## నీకు విజన్ లేదు.. విస్తరాకులు కట్టాలేదు...

కొడుకు రాజకీయ భవిష్యత్తు తప్ప మరి ఏ విజను లేదు...

చంద్రబాబుపై కన్నబాబు ఫైర్...




కాకినాడ రూరల్... చంద్రబాబు తనయుడు నారా లోకేష్ రాష్ట్రంలో పర్యటిస్తూ వైసిపి పార్టీపై మా అధినాయకుడు జగన్మోహన్ రెడ్డి పై ఆ అవాకులు చవాకులు మాట్లాడడం తగదని ఖండించారు. చంద్రబాబు కు విజను లేదు విస్తరాకులు కట్టలేదని ఎద్దేవా చేశారు. చంద్రబాబుకు రాష్ట్రంపై ప్రేమ కంటే తన కుమారుడు లోకేష్ రాజకీయ భవిష్యత్తు పై తప్ప మరి ఏ విజన్ లేదని విమర్శించారు. చంద్రబాబు వెంట ఉండే భజన పార్టీలకు చంద్రబాబు గొప్ప నాయకుడిగా కనబడతారని రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి మా నాయకుడు జగన్ చేస్తున్న సంక్షేమ పథకాలు కనబడవా అని ఎదురు ప్రశ్నించారు.

# జూన్ నాటికి లక్ష టిడ్కో ఇళ్లు పంపిణీ

- జగనన్న వసతి దీవెనతో 9.5 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి
- గొప్ప గొప్ప విద్యావేత్తలను అందించిన ఘన చరిత్ర ఏయూ ది
- దేశంలో దాఖలు చేస్తున్న పేటెంట్లు పెంచడంపై దృష్టి సారించాలి

- ఎంపీ(రాజ్యసభ) విజయసాయిరెడ్డి



అమరావతి (విజయభాను న్యూస్): ఈ ఏడాది జూన్ నాటికి మొత్తం లక్ష టిడ్కో ఇళ్లు లబ్దిదారులకు అందించేలా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, ఈ మేరకు కార్యాచరణ రూపొందించిందని రాజ్యసభ సభ్యులు, వైకాపా జాతీయ ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. ఇప్పటికే 48 వేలకు పైగా గృహ ప్రవేశాలు జరిగినట్లు, రెండో విడతలో మరో 40 వేల గృహ ప్రవేశాలు జరగనున్నట్లు తెలిపారు. అన్ని సదుపాయాలతో పేదల ఇళ్లు ముస్తాబవుతున్నాయని అన్నారు. సోషల్ మీడియా వేదికగా బుధవారం ఆయన పలు అంశాలకు వెల్లడించారు.

**జగనన్న వసతి దీవెనతో 9.5 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి....**

జగనన్న వసతి దీవెన పథకం కింద రాష్ట్రంలో 9,55,662 లక్షల మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారని విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. ట్విట్టర్ వేదికగా బుధవారం ఆయన పలు అంశాలు వెల్లడించారు. ఉన్నత విద్యను అందరికీ అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ విద్యార్థుల తల్లుల ఖాతాల్లో 912.71 కోట్లు జమ చేశారని అన్నారు. ఉన్నత చదువులు చదువుతున్న పేద విద్యార్థులకు భోజన, వసతి ఖర్చుల కోసం ఏటా రెండు వాయిదాల్లో జగనన్న వసతి దీవెన పథకం కింద జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని అన్నారు.

**గొప్ప విద్యావేత్తలను అందించిన ఏయూ....**

ఆంధ్రా యూనివర్సిటీ 98 వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులకు నివాళులర్పిస్తున్నానని విజయ సాయి రెడ్డి అన్నారు. దేశాభివృద్ధికి తోడ్పాడు అందించే విధంగా ఈ గొప్ప విశ్వవిద్యాలయం వివిధ రంగాలలో ప్రముఖులను ఉత్పత్తి చేస్తుందని అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీని ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దిన అలనాటి విద్యావేత్తల వారసత్వాన్ని ప్రస్తుత యాజమాన్యం కొనసాగించాలని కోరుకుంటున్నానని అన్నారు. ఈ మేరకు విశ్వవిద్యాలయంలోని అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులకు శుభాకాంక్షల తెలియజేస్తున్నట్లు తెలిపారు. దేశంలో దాఖలు చేస్తున్న పేటెంట్లు పెంచడంపై దృష్టి సారించాలని విజయసాయి రెడ్డి అన్నారు. బుధవారం ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవం సందర్భంగా ఈ విషయంపై స్పందిస్తూ పాఠశాలలు, విశ్వవిద్యాలయాల్లో పేటెంట్లు, పేటెంట్ల దాఖలు ఒక సబ్జెక్టుగా బోధించాలని సూచించారు. గత ఏడాది భారత్ 65000 పేటెంట్లు దాఖలు చేయగా, చైనా 15.85 లక్షలు దాఖలు చేసిందని అన్నారు. అలాగే భారతీయ ఆవిష్కరణలకు రక్షణ కల్పించాలని ఆయన కోరారు.

## జగనన్న వసతి విద్యా దీవెన పథకంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏపీ ట్రైకర్ చైర్మన్ సతిక బుల్లి బాబు..

అల్లూరిజిల్లా.విజయభాను. న్యూస్.. పాడేరు.. కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ పథకాలలో భాగంగా నవరత్నాలలో భాగమైన జగనన్న వసతి దీవెనపథకం ద్వారా విద్యార్థుల యొక్క తల్లుల వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలలోకి నేరుగా నగదు జమ చేసే కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక.బుల్లిబాబు చైర్మన్ మాట్లాడుతూ,గతంలో ఎన్నడూఏ ప్రభుత్వమూ చేపట్టలేని సంక్షేమ పథకాలు కేవలం మన రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు వై.యస్.జగన్మోహన్ రెడ్డిమాత్రమే చేపడుతున్నారని, చదువుకునే విద్యార్థులకు ఈ జగనన్న వసతి దీవెన పథకం ఎంతో ఉపయోగపడుతుందని, ఈ నగదును సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు.పేద ప్రజల కోసం ఎన్నో మంచి పనులు చేస్తున్న జగనన్నకు రాష్ట్ర ప్రజలంతా అండగాఉండాలని ఆయన పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో...

పాడేరు సర్పంచ్ సీతమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు రత్నాలమ్మ , డిప్యూటీ డైరెక్టర్ కొండల రావు, సచివాలయం సిబ్బంది ,గ్రామ వాలంటీర్లు ,పథకం లబ్ధిదారులు మరియు వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.




# టైమ్‌లెస్ లవ్...




హీరో నాగచైతన్య నటిస్తోన్న తాజా చిత్రం కస్టడీ. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని వెంకట్ ప్రభు డైరెక్ట్ చేస్తున్నాడు. మే 12న విడుదల అవుతుంది. ప్రమోషన్లో భాగంగా ఈ చిత్రం నుంచి 'టైమ్‌లెస్ లవ్' లిరికల్ వీడియో సాంగ్‌ను లాంఛ్ చేశారు. రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటను యువన్ శంకర్ రాజా, కపిల్ పాడారు. చిత్రంలో నాగచైతన్యకు జోడీగా కృతిశెట్టి నటిస్తోంది. కస్టడీలో నాగచైతన్య పోలీసాఫీసర్ శివగా కనిపించబోతున్నాడు. యాక్టర్ అరవింద్ స్వామి విలన్‌గా నటిస్తున్నారు. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాసా చిట్టూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇళయరాజా, యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్నారు.

# 2023 లో పవన్ లెక్క మారింది!




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఏడాదికి ఒక సినిమా చేసి రిలీజ్ చేయడమే అతికష్టం మీద జరుగుతుంది. పవన్ జాబితా చూస్తే ఇప్పటివరకూ ఏడాదికి ఒక సినిమానే కనిపిస్తుంది. పవన్ కెరీర్ ప్రారంభమై 27 ఏళు అవుతుంది. ఇప్పటివరకూ ఆయన చేసిన సినిమాల సంఖ్య కూడా 27. అయితే 2023 లో ఆ నెంబర్ ఒక్కసారి గా మారబోతుంది. ఒకేసారి ఏకంగా మూడు..నాలుగు సినిమాలు ఈ ఏడాది లిస్ట్ లో కనిపిస్తు న్నాయి.

ప్రస్తుతం ఆయన ఏకంగా నాలుగు సినిమాలు లైన్ లో పెట్టిన సంగతి తెలిసిందే. క్రిష్ దర్శకత్వంలో హరి హర వీరమల్లులో నటిస్తున్నారు. ఇది సెట్స్ లో ఉండగానే సుజిత్ దర్శకత్వంలో ఓజీ ని సెట్స్ పైకి తీసుకెళ్లారు. అలాగే హరిష్ శంకర్ దర్శకత్వంలో ఉస్తాద్ భగత్ సింగ్ ని లైన్ లో పెట్టారు. ఇలా ఇన్ని సినిమాల షూటింగ్ లో పాల్గొనడం పవన్ కెరీర్ లో ఇదే తొలిసారి. ఇప్పటివరకూ ఆడతా పాడతా సినిమాలు చేసిన పీకే ఒకేసారి మూడు నాలుగు సినిమా షూటింగ్ లకు హాజరవుతున్నారు.రాజకీయంగా ఆయన జర్నీ ప్రారంభం అవ్వడంతోనే పవన్ ఇలా సినిమాల స్పీడ్ పెంచాల్సి వచ్చింద న్నది తెలిసిందే. అయితే ఇలా సినిమాల నెంబర్ మారడం అన్నది పవన్ సినిమా జీవితంలో ఇదే మొట్ట మొదటి సారి. రెండున్నర దశాబ్ధాల ప్రయాణంలో ఏనాడు ఒకే ఏడాది రెండు..మూడు సినిమాలు రిలీజ్ చేసింది కూడా లేదు. 2023-24 సంవత్సరాల్లో ఆ సన్నివేశం కూడా చోటు చేసుకోబోతుంది. వీలైనంత వరకూ 2024 ఎన్నికలకు ముందే ఈ సినిమాలన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చే సంకల్పంతో నే పవన్ ఉన్నారు. ఆ దిశగానే పవన్ ప్రణాళిక కనిపిస్తుంది. మరి మధ్యలో ఏవైనా మార్పులు జరిగితే గనుక వాటి రిలీజ్ ఆలస్యమయ్యే అవకాశం ఉంటుంది.

అయితే పవన్ లో ఈ రకమైన మార్పుతో అభిమానులు సంతోషంగా ఉన్నారు. వీలైనన్ని ఎక్కువ సినిమాలు చేయాలని పీకేని ఎప్పటి నుంచో అభిమానులు కోరుతున్నారు. రెండు దశాబ్ధాల ప్రయాణంలో ఆ మాట పెడ చెవిన పెట్టారు. ఇప్పుడు మాత్రం తప్పక సినిమాలు చేయాల్సి రావడంతో? అభిమానుల కోరిక ఆ రూపంలో తీరుతుందనొచ్చు.

# జట్టు గెలిచినా.. విరాట్‌కు వరుసగా రెండోసారి కలిసిరాని గ్రీన్ జెర్సీ




ఐపీఎల్ 16వ సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తన సొంత మైదానం చిన్నస్వామి స్టేడియం వేదికగా మరో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. పచ్చదనంపై అవగాహన కల్పించేందుకు 2011 నుంచి ఆర్‌సీబీ తన హోం గ్రౌండ్‌లో జరిగే ఏదొక మ్యాచ్‌లో గ్రీన్ జెర్సీతో బరిలోకి దిగడం ఆనవాయితీగా మార్చుకుంది. ఈ సీజన్‌లోనూ రాజస్థాన్ రాయల్స్‌తో గ్రీన్ జెర్సీలోనే విరాట్ కోహ్లీ నాయకత్వంలో తలపడింది. ఆర్‌సీబీ ఏడు పరుగుల స్వల్ప తేడాతో రాజస్థాన్‌పై విజయం సాధించింది. అయితే, కెప్టెన్ విరాట్ మాత్రం మరోసారి ఈ గ్రీన్ జెర్సీలో విఫలం కావడం అభిమానులకు రుచించలేదు.

టాస్ ఓడిన బెంగళూరు తొలుత బ్యాటింగ్ చేసింది. ఓపెనర్‌గా వచ్చిన కెప్టెన్ విరాట్ (0) తాను ఎదుర్కొన్న తొలి బంతికే ఎల్బీగా పెవిలియన్‌కు చేరాడు. ట్రెంట్ బౌల్ట్ వేసిన అద్భుతమైన ఇన్‌స్వింగర్‌కు ఊహించని రీతిలో ఔటయ్యాడు. గతేడాది కూడా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ విరాట్ గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. ఎస్‌ఆర్‌హెచ్ బౌలర్ జగదీశా సుచిత్ బౌలింగ్‌లో తొలి బంతికి కేన్ విలియమ్సన్ చేతికి చిక్కాడు. రెండు మ్యాచుల్లోనూ ఆర్‌సీబీ విజయం సాధించడం విశేషం.

**'గ్రీన్ జెర్సీ' మ్యాచ్ విశేషాలు..**

పన్నెండేళ్ల కిందట 'గ్రీన్ జెర్సీ' మ్యాచ్‌లను ప్రారంభించిన ఆర్‌సీబీకి పెద్దగా కలిసిరాలేదు. రాజస్థాన్‌తో జరిగిన మ్యాచ్ వరకు మొత్తం 12సార్లు ఆర్‌సీబీ ఆడింది. అందులో కేవలం నాలుగు సార్లు మాత్రమే విజయం సాధించింది. ఆర్‌సీబీ గెలిచిన మ్యాచుల్లో రెండుసార్లు విరాట్ కోహ్లీ డకౌట్ కాగా.. ఒక మ్యాచ్‌లో సెంచరీ కూడా నమోదు చేశాడు. మరో మ్యాచ్‌లో కీలకమైన 27 పరుగులు చేశాడు.

ఐపీఎల్ 2011లో కోచి టస్కర్స్‌తో మ్యాచ్‌లో ఆర్‌సీబీ 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కోచి 125/9 స్కోరుకే పరిమితం కాగా.. ఆర్‌సీబీ 13.1 ఓవర్లలోనే 128/1 స్కోరు చేసి గెలుపొందింది. విరాట్ (27లి) నాటౌట్‌గా నిలిచాడు.

విరాట్ కోహ్లీ అత్యుత్తమ ఫామ్‌లో ఉన్న 2016 సీజన్‌లో గుజరాత్ లయన్స్‌పై 144 పరుగుల భారీ తేడాతో ఆర్‌సీబీ గెలిచింది. ఇందులో విరాట్ (109) సెంచరీ బాదాడు. విరాట్‌తోపాటు ఏబీ డివిలియర్స్ (129లి) శతకం చేయడంతో ఆర్‌సీబీ 248/3 భారీ స్కోరు చేసింది. అనంతరం గుజరాత్ లయన్స్ 104 పరుగులకే ఆలౌటైంది.

# ఐదు ఫ్లాపులు అయినా తగ్గని అమ్మడి క్రేజ్..!



బుట్ట బొమ్మ పూజా హెగ్డేని మళ్లీ బ్యాడ్ లక్ వెంటాడుతుంది. అమ్మడు చేసిన గత ఐదు సినిమాలు నిరాశపరచాయి. అందులో తెలుగు తమిళ సినిమాలు మూడు ఉండగా హిందీ సినిమాలు రెండు ఉన్నాయి. ప్రభాస్ తో రాధే శ్యాం సినిమా భారీ అంచనాలతో వచ్చి ఫ్లాప్ అయ్యింది.

ఇక ఆ తర్వాత విజయ్ బీస్ట్ ఆశించిన స్థాయిలో అంచనాలను అందుకోలేదు. ఇక ఆ తర్వాత బాలీవుడ్ లో చేసిన సర్కస్ చరణ్ తో చేసిన ఆచార్య సినిమాలు విఫలమయ్యాయి. ఇక లేటెస్ట్ గా బాలీవుడ్ లో సల్మాన్ తో చేసిన కిసి కా భాయ్ కిసి కి జాన్ సినిమా కూడా అమ్మడికి నిరాశ మిగిల్చింది.

బాలీవుడ్ లో హిట్ మేనియా కొనసాగించాలని చూస్తున్న పూజా హెగ్డే కలని కలగానే మిగిలింది. ఐదు ఫ్లాపులు ఉన్నా సరే అమ్మడి క్రేజ్ మాత్రం ఎక్కడ తగ్గట్లేదని చెప్పొచ్చు. ప్రస్తుతం త్రివిక్రమ్ మహేష్ కాంబో సినిమాలో పూజా నటిస్తుంది. ఇదే కాకుండా మరో స్టార్ హీరో సినిమాలో కూడా పూజా బేబీ ఛాన్స్ అందుకుందట. స్టార్ సినిమాల్లో ఫలితాలతో సంబంధం లేకుండా అమ్మడు ఛాన్స్ లు అందుకుంటుంది. కెరీర్ మొదట్లో కూడా పూజా హెగ్డేకి మొదట ఫ్లాపులే పలకరించాయి. కానీ అల్లు అర్జున్ దువ్వాడ జగన్నాథం సినిమాతో అమ్మడి రేంజ్ మారిపోయింది.

అంతకుముందు గ్లామర్ షో విషయంలో ఆలోచించిన పూజా డీజేలో తన గ్లామర్ షోకే ప్రేక్షకులు పడిపోయారన్న రీజన్ తో అమ్మడు వరుస సినిమాల్లో గ్లామర్ షో చేస్తూ వస్తుంది. పూజా థై షోకి సెపరేట్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. అమ్మడు సినిమాలో ఉంది అంటే తొడల అందాల ప్రదర్శన చాలా కామన్ అనిపించేలా చేసింది. ఆ గ్లామర్ షో వల్లే అమ్మడికి సినిమాల రిజల్ట్ తో తేడా లేకుండా ఛాన్స్ లు వస్తున్నాయి.ఏది ఏమైనా ఒకటి రెండు ఫ్లాపులు పడితేనే అడ్రస్ లేకుండా పోతున్న హీరోయిన్స్ ఉండగా పూజా హెగ్డే మాత్రం హిట్లు వస్తున్నా మళ్లీ అవకాశాలను మాత్రం అందుకుంటూ ఫాం కొనసాగిస్తుంది. మహేష్ 28వ సినిమా హిట్ అయితే అమ్మడు మళ్లీ తిరిగి ఫాం లోకి వచ్చినట్టే.

# శరత్‌బాబు ఆరోగ్యం విషమం



సీనియర్ సినీనటుడు శరత్‌బాబు అస్వస్థతకు లోనైన విషయం తెలిసిందే. ఆయనను ఈ నెల 20న హైదరాబాద్‌లోని ఏసియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీలో చేర్పించారు. ఇప్పుడు ఆయన ఆరోగ్యం విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. శరీరం మొత్తం ఇన్‌ఫెక్షన్ కావడంతో ఆ ప్రభావం కిడ్నీలు, ఊపిరితిత్తులు, కాలేయంతోపాటు ఇతర అవయవాలపై పడ్డట్టు వెల్లడించారు. ప్రస్తుతం శరత్‌బాబుకు ఐసీయూలో వెంటిలేటర్‌పైనే చికిత్సనందిస్తున్నామని డాక్టర్లు తెలిపారు. అనారోగ్యంతో కొన్ని రోజులుగా బెంగళూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శరత్ బాబును మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లో ఆసుపత్రిలో జాయిన్ చేశారు. శరత్‌బాబు త్వరగా కోలుకోవాలని సినీ ప్రముఖులు, అభిమానులు కోరుకుంటున్నారు.

# పోలీసులను ఆశ్రయించిన సింగర్ సునీత భర్త



ప్రముఖ సింగర్ సునీత భర్త వీరపనేని రామకృష్ణ పోలీసులను ఆశ్రయించారు. కేకే లక్ష్మణ్ అనే వ్యక్తి సినీ నిర్మాతల సభ్యుడినని తరచూ పోన్లు చేస్తున్నాడని, అర్జెంటుగా మాట్లాడాలని పిలుస్తున్నాడని ఫిర్యాదు చేశారు. అతని నెంబర్ బ్లాక్ చేసినా కొత్త నెంబర్ నుండి ఫోన్లు చేస్తున్నాడని తెలిపారు. తనకు, తన కుటుంబ సభ్యులకు అతని నుండి ప్రాణహాని ఉందని, అతడిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.


# ఆ సవాల్‌కు జవాబే 'విరూపాక్ష'



"గతేడాది కొన్ని చిత్రాలకు జనాలు రాలేదు. ఎందుకంటే వాళ్లు మాకు సవాల్ విసిరారు. తమని థియేటర్లకు రప్పించే సినిమాలు చేయండని చెప్పారు. ఆ సవాల్‌కు జవాబే మా 'విరూపాక్ష" అన్నారు సాయిధరమ్ తేజ్. ఆయన హీరోగా నటించిన ఈ చిత్రాన్ని కార్తీక్ దండు తెరకెక్కించారు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. సంయుక్తా మేనన్ కథానాయిక. ఈ సినిమా ఇటీవల విడుదలైంది. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్‌లో ఆదివారం సక్సెస్ మీట్ నిర్వహించారు. దర్శకులు మారుతి, గోపీచంద్ మలినేని అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో సాయితేజ్ మాట్లాడుతూ.. "ఈ విజయం నాదో.. మా బృందానిదో కాదు. ప్రేక్షకులది. మన పరిశ్రమ బ్లాక్‌బస్టర్ సక్సెస్ ఇది. ఇందులోని నటీనటులు, సాంకేతిక నిపుణులందరికీ కృతజ్ఞతలు. ఈ చిత్రాన్ని ఇప్పుడు పాన్ ఇండియా స్థాయిలో తీసుకెళ్లడానికి ప్రణాళిక రచిస్తున్నాం" అన్నారు. "మంచి గురువుంటే మంచి శిష్యులొస్తారు. ఇప్పుడు సుకుమార్‌ను చూస్తే అదే అనిపిస్తోంది. కార్తీక్ తను అనుకున్న కథను ఎంత నమ్మకంగా చెప్పాడనేది సినిమా చూస్తేనే తెలుస్తోంది. అందుకే ఈ విజయం వచ్చింది. 24 క్రాఫ్ట్ మనసు పెట్టి చేసిన చిత్రమిది" అన్నారు దర్శకుడు మారుతి. 'గొప్ప థియేట్రికల్ అనుభూతినిచ్చే చిత్రమిది. ఊహలకు అందని రీతిలో సాగింది' అన్నారు దర్శకుడు గోపీచంద్ మలినేని. "మా చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ఈ సినిమా విషయంలో నాకు అండగా నిలిచిన అందరికీ ఎప్పటికీ రుణపడి ఉంటా" అన్నారు.

దర్శకుడు కార్తీక్ దండు. ఈ కార్యక్రమంలో సంయుక్త, బీవీఎస్ఎన్ ప్రసాద్, అజనీష్ లోక్‌నాథ్, శ్యామ్‌దత్, బ్రహ్మాజీ, సాయిచంద్, అజయ్, కమల్ తదితరులు పాల్గొన్నారు.

# హాస్యనటుడు చలాకీ చంటికి గుండెపోటు



హాస్యనటుడు చలాకీ చంటి అస్వస్థతకు గురయ్యారు. తీవ్రమైన ఛాతీనొప్పి రావడంతో కుటుంబసభ్యులు గచ్చిబౌలిలోని కేర్ ఆసుపత్రికి తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి పరిశీలించిన వైద్యులు గుండెపోటుగా గుర్తించారు. అవసరమైన పరీక్షలు నిర్వహించి.. రక్తనాళాల్లో పూడికలు ఉన్నట్లు తేలడంతో వైద్యులు స్టంట్ వేసినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి కొంత నిలకడగా ఉందని, ఐసీయూలో చికిత్స అందిస్తున్నట్లు స్పష్టం చేశారు.

# ఒంటిపై మరో పచ్చబొట్టు వేయించుకున్న శ్రుతిహాసన్



కథానాయికల్లో పచ్చబొట్టు ప్రేమికులు చాలా మందే. అందులో శ్రుతిహాసన్ ఒకరు. ఇప్పటికే ఆమె మణికట్టుపై గులాబీ, చెవి వెనక సంగీతాన్ని గుర్తు చేసేలా పచ్చబొట్లు సింగారించుకుంది. స్టైల్‌కి, ఫ్యాషన్‌కీ, అభిరుచికి ప్రతీకగా అవి నిలుస్తుంటాయి. తాజాగా ఆమె ఒంటిపై మరొక పచ్చబొట్టు భాగమైంది. దాంతో ఈసారి ఆమె తనలోని భక్తిభావాన్ని ప్రదర్శించారు. ఇష్టదైవం మురుగన్ ఆయుధంలోనే... తమిళంలో తన పేరుండేలా పచ్చబొట్టు డిజైన్ చేయించుకున్నారు. ఆ విషయాన్ని ఇన్‌స్టా ద్వారా వెల్లడించారు శ్రుతి. "నేనెప్పుడూ ఆధ్యాత్మికతవైపు మొగ్గు చూపుతుంటా. నా హృదయంలో మురుగన్‌కి ప్రత్యేకమైన స్థానం ఉంది. ఈ పచ్చబొట్టుతో నాలోని భక్తిని ప్రదర్శించాలనుకున్నా" అని చెప్పుకొచ్చారు. ఆమె ప్రభాస్‌తో కలిసి 'సలార్'లో నటించారు.

# భవిష్యత్ సంపదగా మేధో హక్కులు నిలుస్తాయి

## - ఏయూలో ఘనంగా ఐపిఆర్ దినోత్సవం
## - పేటెంట్‌లు సాధించిన మహిళలకు సత్కారం



ఆంధ్రవిశ్వవిద్యాలయం **(విజయభాను న్యూస్) :** భవిష్యత్ తరాలకు నిజమైన సంపదగా మేధో హక్కులే నిలుస్తాయని ఎన్ఎస్‌టిఎల్ డైరెక్టర్ వై.శ్రీనివాస రావు అన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో భాగంగా ఏయూ రసాయన శాస్త్ర విభాగం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రపంచ మేధో హక్కుల దినోత్సవ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస రావు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ మనం సాధించిన పేటెంట్‌లను కమర్షియల్ చేయడం ఎంతో అవసరమన్నారు. తద్వారా సంపదను సృష్టించడం సాధ్యపడుతుందని, ఈ దిశగా ఆవిష్కర్తలు ఆలోచన చేయాలని సూచించారు. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం నూతన ఆవిష్కరణలకు, దేశీయంగా ఉత్పత్తిని పెంచడానికి అవసరమైన సహకారం అందిస్తోందన్నారు. పేటెంట్‌తో పాటు బ్రాండింగ్, ట్రేడ్ మార్క్ వంటివి చాలా అవసరమన్నారు. నేడు తమ ప్రతిభతో మహిళలు అన్ని రంగాలలో రాణి స్తున్నారన్నారు. శాస్త్రీయ ఆవిష్క రణలు, పేటెంట్‌లు సాధించడంలో ప్రతిభ చూపుతున్నారన్నారు. ఎన్ఎస్‌టిఎల్ సైతం తన ప్రస్థానాన్ని ఆంధ్రవిశ్వవిద్యాలయం నుంచి ప్రారంభించిందన్నారు. ఏయూ ఐపిఆర్ చెయిర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం మాట్లాడుతూ ఐపిఆర్‌పై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ ఆర్థిక ప్రగతి ఐపిఆర్‌పై ఆదారపడి ఉంటుందన్నారు. ఇప్పటికే ఏయూ 70 పేటెంట్‌లను దరఖాస్తు చేసామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం మహిళలను అన్ని రంగాలలో ప్రోత్సహిస్తోందన్నారు.

కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఆ హబ్ సిఈఓ రవి ఈశ్వరపు, ఆచార్య శ్యామల తదితరులు పాల్గొన్నారు. అనంతరం వర్సిటీ నుంచి పేటెంట్‌లు సాధించిన డాక్టర్ చందన లక్ష్మి, డాక్టర్ అపరంజిలను సత్కరించి, జ్ఞాపికలు బహూకరించారు. ఆంధ్రవిశ్వ విద్యాలయం తరపున ఎన్ఎస్‌టిఎల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస రావును సత్కరించారు.

# జీవో నెంబర్ 301,388 పట్టాదారులకు పూర్తి హక్కులు పొందుటకు, పట్టాలో సవరణకు అవకాశం

## యు.ఎల్.సి భూ హక్కు దారులకు స్లాబ్ విధానం ద్వారా రిజిస్ట్రేషన్
## - జాయింట్ కలెక్టర్ కె.యస్.విశ్వనాథన్



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** గతంలో జీవో నెంబర్ 301, 388 ద్వారా పట్టాలు పొందిన హక్కుదారులు కన్వేయన్స్ డీడ్ పొందుటకు మరియు పట్టాలలో ఎటువంటి తప్పిదాలు ఉన్న సవరణకు ప్రభుత్వం జీవో నెంబర్ 71 , 72 ద్వారా కల్పించిన ఆకాశాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ కె.యస్.విశ్వనాథన్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం గోపాలపట్నం సచివాలయం కార్యాలయంలో జీవో నెంబర్ 301, 388 ద్వారా పట్టాలు పొందిన లబ్ధిదారులు పట్టాలలో ఎటువంటి మార్పులు, తప్పిదాలు ఉన్న సవరణకు అదేవిధంగా పట్టాలు పొందిన వారు కన్వెన్షన్ డీడ్ పూర్తి హక్కులను పొందుటకు దరఖాస్తు చేసుకొనుటకు అవకాశం కల్పించే కరెక్షన్ మాడ్యూల్ అప్లికేషన్ ప్రారంభించారు. సచివాలయం ద్వారా ఈరోజు నుండి మే నెల 26వ తేదీ వరకు నెల రోజుల పాటు దరఖాస్తులు పొందవచ్చు అని అన్నారు. గతంలో పట్టాలు పొందినవారు అమ్ముకొనుటకు లేక చాలా ఇబ్బందులు పడ్డారని ఇప్పుడు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అదేవిధంగా యు.ఎల్ .సి భూములలో ఇల్లు కట్టుకున్న వారు గతంలో ఇచ్చిన జీవోలో ఫీజులు చాలా అధికంగా ఉన్నందున ఇప్పుడు స్లాబ్ సిస్టం ద్వారా కన్వేయన్స్ డీడ్ పొందుటకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు.

0 నుండి150 గజాల వరకు డీ పట్ట కల్పించి పది సంవత్సరాల తర్వాత పూర్తి హక్కులు కల్పిస్తారని అన్నారు. 150 నుండి 300 చదరపు గజాల వరకు 15% కాన్వేయన్స్ ఫీజుతో రిజిస్ట్రేషన్ చేయబడునని, అదేవిధంగా 300 నుండి 500 గజాల వరకు 30% మరియు 500 చదరపు గజాలకు పైబడి ఉన్న స్థలాల్లో 100% కాన్వేయన్స్ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అన్నారు. ఆసక్తి ఉన్న దరఖాస్తుదారులు దగ్గర్లో ఉన్న సచివాలయంలో అప్లికేషన్ పొందవచ్చు అని తెలిపారు . ఈ అవకాశం ఈ సంవత్సరం ఆఖరి వరకు అనగా 31.12.2023 వరకు ఉంటుందని వెల్లడించారు. దరఖాస్తుదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

# 157 ప్రభుత్వ నర్సింగ్ కాలేజీల ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

దిల్లీ: దేశ వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో నర్సింగ్ కళాశాలల ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ పచ్చజెండా ఊపింది. మొత్తం రూ.1,570 కోట్ల వ్యయంతో 157 నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న వైద్య కళాశాలలకు అనుబంధంగానే ఈ నర్సింగ్ కాలేజీలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. దేశంలో నాణ్యతతో కూడిన నర్సింగ్ విద్యను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు నైపుణ్యంతో కూడిన నర్సింగ్ సిబ్బంది సంఖ్యను పెంచడమే లక్ష్యమన్నారు. కొత్తగా ఏర్పాటు చేసే నర్సింగ్ కాలేజీలను వైద్య కళాశాలలతో కలిపి ఉంచడం వల్ల ప్రస్తుతం అక్కడ అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, స్కిల్ ల్యాబ్‌లు, క్లినికల్ సౌకర్యాలు, అధ్యాపక సిబ్బందిని వినియోగించుకొనే అవకాశం కలగనుంది. సరైన ప్రణాళికతో ఈ ప్రాజెక్టును రెండేళ్ల వ్యవధిలోనే పూర్తి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. జాతీయ వైద్య పరికరాల విధానానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపినట్టు మంత్రి మన్‌సుఖ్ మాండవీయ వెల్లడించారు. దేశీయంగా వైద్య పరికరాల ఉత్పత్తిని పెంచడం, దిగుమతులను తగ్గించుకోవడమే లక్ష్యంగా రూపొందించిన ఈ విధానాన్ని కేంద్ర కేబినెట్ ఆమోదించిందన్నారు. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన ఈ కేబినెట్ సమావేశంలో పలువురు మంత్రులు పాల్గొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడలో జరిగిన ఐఈడీ పేలుడు ఘటనలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులకు నివాళులర్పిస్తూ ఈ సందర్భంగా ప్రధాని మోదీ.. తీర్మానం ప్రవేశపెట్టారని కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ వెల్లడించారు.

# సబ్ రిజిస్ట్రార్, తహశీల్దార్ కార్యాలయాలపై ఏసీబీ దాడులు..

అమరావతి: ఏపీలో పలు సబ్‌రిజిస్ట్రార్, తహశీల్దార్ కార్యాలయాలపై ఏసీబీ దాడులు చేసింది. ఏసీబీ 14400 కాల్ సెంటర్, యాప్‌కి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఈ తనిఖీలు చెపట్టింది.

బద్వేల్, తిరుపతి రూరల్, అనంతపురం రూరల్, తుని, నర్సాపురం, కందుకూరు, మేడికొండూరు, గుంటూరు, జలమూరు ఎమ్మార్వో ఆఫీసు, శ్రీకాకుళంలో ఏసీబీ ఆకస్మిక సోదాలు నిర్వహించింది.

# కార్యదర్శులు నిబద్ధతో పని చేయండి

## - జివిఎంసి కమిషనర్ సీ ఎం సాయికాంత్ వర్మ



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** ప్లానింగ్ కార్యదర్శులు నిబద్ధతతో పనిచేయాలని జివిఎంసి కమిషనర్ సీ ఎం సాయికాంత్ వర్మ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం ఆయన ఆంధ్ర యూనివర్సిటీ అంబేద్కర్ భవనంలో ప్లానింగ్ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లానింగ్ కార్యదర్శులు నిబద్ధత, ఖచ్చితత్వంతో పనిచేయాలని, ముఖ్యంగా ఫుట్ పాత్ ఆక్రమణలు, భవన నిర్మాణ వ్యర్థాలు, జివిఎంసి ఆస్తుల పరిరక్షణ, ప్లానింగ్ పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి నగరాభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆదేశించారు. సచివాలయ పరిధిలో ఫుట్ పాత్ లు, వీధిరోడ్ల ఆక్రమణ జరగ కుండా చూడాలని, రోడ్లకు ఇరువైపులా భవన నిర్మాణ వ్యర్థాలు వేయకుండా నిరోధించాలని, జివిఎంసి ఆస్తులు ఆక్రమణకు గురికాకుండా వాటిని పరిరక్షించాలని ఆదేశించారు. ప్లాన్ మంజూరు తోపాటు భవన నిర్మాణదారులు ప్లాన్ ప్రకారం ఇల్లు నిర్మిస్తున్నదీ లేనిది చూడాలని, ఇళ్ళు నిర్మించేటప్పుడు ఎటువంటి ఆక్రమణలు లేకుండా చూడవలసిన బాధ్యత ప్లానింగ్ కార్యదర్శులపై ఉందన్నారు. వీధివిక్రయ దారులకు అనుకూలంగా దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు క్రమ పద్ధతి లో ప్లాన్ ఇవ్వాలన్నారు.

# టిడిపి మే డే ను విజయవంతం చేయండి

## - ముఖ్యఅతిథిగా హాజరవుతున్న టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు



విశాఖపట్నం (విజయభాను న్యూస్): టిడిపి మే డే విజయవంతం చేయాలని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మేడే సందర్భంగా రాష్ట్ర టిఎన్టియుసి ఆధ్వర్యంలో గాజువాక లంకా మైదానంలో సాయంత్రం నాలుగు గంటలకు మేడ ఉత్సవాలు నిర్వహిస్తున్న సందర్భంగా బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ మేడే రోజు సాయంత్రం గాజువాక లంకా మైదానంలో రాష్ట్ర టిఎన్టియుసి ఆధ్వర్యంలో మేడ ఉత్సవాలు జరుగుతాయని ఈ ఉత్సవాలకు రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు విచ్చేసి విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో టి ఎన్ టి యు సి రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, పార్లమెంట్ ఇంచార్జ్ ఎం శ్రీ భరత్, జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పాశర్ల ర్ల ప్రసాద్, టి ఎన్ టి యు సి పార్లమెంట్ అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, లెనిన్ బాబు, బండారు అప్పారావు, నాగోతి శివాజీ, వెంకన్న బాబు, కోర్రాయి నాగార్జున, దేవరపు అప్పలరాజు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# 'మోదీజీ.. మా మన్ కీ బాత్ కూడా వినండి': మహిళా రెజ్లర్లు

దిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ పై కేసు నమోదు చేయాలని కోరుతూ ఏడుగురు మహిళా రెజ్లర్లు దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నుంచి నిరసన చేస్తున్నారు. ఈ క్రమంలోనే వారు అతనిని అరెస్ట్ చేయాలని కోరుతూ సుప్రీం కోర్టు లో పిటిషన్ దాఖలు చేశారు. త్వరలోనే వీరంతా ప్రధాని మోదీని కలిసి తమ బాధను వివరిస్తామని తెలిపారు.

" ప్రధాని మోదీ సార్ మీరు బేటీ బచావ్.. బేటీ బచావ్ గురించి చెబుతారు. మన్ కీ బాత్ ద్వారా అందరితో మాట్లాడుతారు. అలానే మా మన్ కీ బాత్ కూడా వినలేరా?. దేశం కోసం పతకాలు సాధించిన సమయంలో మమ్మల్ని ఇంటికి ఆహ్వానించారు. ఈ రోజు మా బాధ చెప్పుకునేందుకు మరో అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నాం." అని ఒలింపిక్ పతక విజేత సాక్షి మాలిక్ కోరారు. నాలుగు రోజులుగా ఆందోళన వ్యక్తం చేస్తున్నా.. ఎందుకు మౌనంగా ఉన్నారని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీని వినేశ్ ఫోగట్ ప్రశ్నించారు. మా ఆవేదన పెద్దలకు చేరడం లేదనకుంటా.. అందుకే మేమంతా ప్రధానిని కలిసి మా బాధ వ్యక్తం చేయాలనుకుంటున్నామని అన్నారు.

"శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న తమను భోజనం కూడా సిద్ధం చేసుకోనివ్వడంలేదు. బ్రిజ్ భూషణ్ పరపతి గురించి చెప్పి మమ్మల్ని కొందరు భయపెట్టాలని చూస్తున్నారు. మహిళా రెజ్లర్లకు న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించేది లేదు. క్రీడాకారులుగా ఐకమత్యంగా రెజ్లర్లకు మద్దతు పలకాలని కోరుతున్నాం" అని బజరంగ్ పునియా విజ్ఞప్తి చేశారు. మరోవైపు మహిళా రెజ్లర్లు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీం కోర్టు దిల్లీ పోలీసులకు నోటీసులిచ్చింది. దీనిపై దిల్లీ పోలీసులు స్పందిస్తూ.. కేసు నమోదుకు ముందు కొంత ప్రాథమిక దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని కోర్టుకు తెలిపారు.

# నెహ్రూ ఫుల్ బ్రైట్ స్కాలర్షిప్ పై గీతంలో సదస్సు



సాగర్‌నగర్ **(విజయభాను న్యూస్) :** భారత్ అమెరికా దేశాల మధ్య మేధోపరమైన సహకారానికి గాను యుఎస్-ఇండియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ద్వారా భారతీయ పరిశోధకులు, విద్యార్థులు, అధ్యాపకులకు అందిస్తున్న నెహ్రూ ఫుల్ బ్రైట్ స్కాలర్షిప్ పై గీతంలో బుధవారం ప్రత్యేక సదస్సును నిర్వహించారు.

గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు యుఎస్-ఇండియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ భారతీయ వ్యవహారాల మేనేజర్ గాయత్రీ సింఘాల్ ముఖ్యఅతిథిగా హజరయ్యారు. భారతీయులకు బోధన, పరిశోధనలలో, విదేశీ భాషా విభాగంలో అందిస్తున్న వివిధ స్కాలర్ షిప్ ల వివరాలు, వాటికి కావలసిన అర్హతలు, దరఖాస్తు విధానం వంటి అంశాలపై అవగాహన కలిగించారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ డైరక్టర్ మరియు ఫుల్ బ్రైట్ స్కాలర్షిప్ గ్రహీత ప్రొఫెసర్ నళినీ బిక్కిన తనకు లభించిన అవకాశాలను, గుర్తింపును వివరించారు.

గీతం అదర్ కెరీర్ ఆప్షన్స్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బి.రవికాంత్ తమ విభాగం ద్వారా ఉన్నత విద్యా అవకాశాలతో పాటు దేశ,విదేశాలలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు అందిస్తున్న స్కాలర్షిప్ లపై అవగాహన కలిగిస్తున్నట్లు వెల్లడించారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com